# ఐక్య ఉపాధ్యాయ

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక

సంపుటి - 5 సంచిక -12 కృష్ణా/విజయవాడ డిసెంబర్ - 2024 పేజీలు - 36 రూ.20.00



## అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య


పాఠశాల విద్యాశాఖ చీఫ్ సెక్రటరీ గారికి ప్రాతినిధ్యం


మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులపై పాఠశాల విద్య డైరెక్టర్ గారికి ప్రాతినిధ్యం


పరీక్షల విభాగం డైరెక్టర్ గారికి ప్రాతినిధ్యం


మున్సిపల్ పదోన్నతులపై చిత్తూరు డిఇఓ గారికి ప్రాతినిధ్యం



కర్నూలు డిఇఓ గారికి ప్రాతినిధ్యం


అనంతపురం డిఇఓ గారికి ప్రాతినిధ్యం


కృష్ణా జిల్లా డిఇఓ గారికి ప్రాతినిధ్యం


అనకాపల్లి డిఇఓ గారికి ప్రాతినిధ్యం


ఏలూరు డిఇఓ గారికి ప్రాతినిధ్యం


విశాఖ డిఇఓ గారికి ప్రాతినిధ్యం

# ఐక్యఉపాధ్యాయ

**విద్యా విషయక మాసపత్రిక**



**సంపాదక వర్గం**

**ఎన్.కుమార్ రాజా**
ప్రధాన సంపాదకులు

**సంపాదకవర్గ సభ్యులు**
కె.ఎస్.ఎస్.ప్రసాద్
నక్కా వెంకటేశ్వర్లు
ఐ.ప్రసాదరావు
ఎం.జోగిరాజు
ఎం.లలితశ్రీ


**ఈ సంచికలో...**


| | |
|---|---|
| పదవికాసం | - 04 |
| అమ్మగది కథ | - 05 |
| ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించిన... | - 07 |
| ఏడు తరాలు (పుస్తక సమీక్ష) | - 08 |
| అంతా మన చేతుల్లోనే.. | - 08 |
| నిరంతర కార్యశీలి ఎం.ఏ.కె.దత్ | - 09 |
| చెన్నుపాటి ఆశయాలకు .... | - 11 |
| ప్రశ్నోత్తరాలు | - 12 |
| కృష్ణా-గుంటూరు పిడిఎఫ్ అభ్యర్థి... | - 13 |
| ఉత్తరాంధ్ర పిడిఎఫ్ అభ్యర్థి... | - 14 |
| ఉద్యోగులు అదాయపు పన్ను | - 15 |
| ఉద్యమ వార్తలు | - 22 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | - 28 |



| | | |
|---|---|---|
| 5 సంll చందా | : ` | 850-00 |
| 2 సంll చందా | : ` | 375-00 |
| సంll చందా | : ` | 200-00 |

**Union Bank Online**
A/c No. 346402010025027
IFSC Code : UBIN0534641



**ఐక్యఉపాధ్యాయ**
యుటిఎఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి
గవర్నర్‌పేట, విజయవాడ-520002
Ph.No. : 0866-2973763
MobileNo. : 9494112533
Website : www.aputf.org
E-mail : ikyopadhyaya1975@gmail.com


# స్వర్ణోత్సవ విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేద్దాం

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ 17వ విద్యా వైజ్ఞానిక మహాసభలు 2025 జనవరి 5,6,7,8 తేదీలలో స్వర్ణోత్సవ మహాసభలుగా కాకినాడ పట్టణంలో జరుగనున్నాయి. సంఘం ఆవిర్భవించి ఐదు దశాబ్దాల కాలం పూర్తి అయిన సందర్భంగా జరుగుతున్న ఈ సభలు చారిత్రాత్మక ప్రాధాన్యతను సంతరించుకోనున్నాయి.

ఉపాధ్యాయ ఉద్యమం ప్రాంతాలవారీగా, మేనేజ్‌మెంట్లు, కేడరు వారీగా ఉన్న రోజులలో అన్ని మేనేజ్‌మెంట్లు, క్యాడర్ ఉపాధ్యాయులను సంఘటిత పరచి 1974 ఆగష్టు 10న సంఘం ఒక చారిత్రక అవసరంగా యుటియఫ్ ఏర్పడింది. అమరజీవి చెన్నుపాటి ఆశయాల బాటలో అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా, హక్కులు బాధ్యతలు రెండు నేత్రాలుగా, అవినీతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తూ, పాలకులు ఎవరైనా విద్యారంగ ఉపాధ్యాయ సంక్షేమం కోసం అభ్యుదయ పథంలో సాగిన మహోజ్వల పయనమిది.

1974 రాజమండ్రి ప్రథమ మహాసభలో ఉద్యమ నిర్మాణానికి బీజం వేసి, ఖమ్మం, భీమవరం, విజయవాడ, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు మహాసభల్లో అంతకంతకూ విస్తరిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాకినాడలో జరిగిన రజతోత్సవ మహాసభల నాటికి రాష్ట్రంలోనే అతి పెద్ద సంఘంగా ఎదిగింది. రాష్ట్ర విభజన అనంతరం ఏలూరు, శ్రీకాకుళం, అనంతపురం మహాసభల్లోనూ విస్తరిస్తూ నవ్యాంధ్ర ప్రదేశ్‌లోనూ లక్షకుపైగా సభ్యత్వానికి చేరుకున్నది.

రాష్ట్ర విభజన సందర్భంలోనూ సూత్రబద్ధ వైఖరికి నిలబడి తన విశిష్టతను కాపాడుకున్న ఏకైక సంఘం మనది. జీవితమంతా ఉపాధ్యాయుల కోసం త్యాగాలు చేసిన నాయకత్వం ఉన్న సంఘం మనది. కేవలం ఉపాధ్యాయుల హక్కుల కొరకే కాకుండా సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం కలిగిన సంఘంగా యుటియఫ్ ఎదిగింది.

ఉపాధ్యాయ ఉద్యమంలో అగ్రగామి సంఘంగా ఉంటూ స్వతంత్రంగానూ, ఐక్య ఉపాధ్యాయ ఉద్యమాలలోనూ చురుకైన పాత్ర పోషిస్తూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికుల, పెన్షనర్స్ హక్కుల సాధన కోసం, విద్యారంగ వికాసం కోసం పని చేస్తున్న సంఘం మనది. యుటియఫ్ బలపరచిన అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా గెలిపించుకుని వారిని పిడిఎఫ్‌గా ఉపాధ్యాయ ఉద్యమానికి అండగా నిలిపిన సంఘం మనది.

ఈ యాభైఏళ్ళ యుటియఫ్ చరిత్రను, ఉపాధ్యాయుల జీవితాల్లో వచ్చిన మార్పును నేటితరం ఉపాధ్యాయులకు తెలియజెప్పాల్సిన సమయమిది. ఈ సభల్లో విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్ళను, పరిష్కార మార్గాలను నెదుర్కుంటూ భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించు కుందాం. రానున్న కాలంలో మన ఉద్యమాన్ని మరింత శక్తివంతంగా రూపొందించుకుని, చైతన్యవంతంగా నడుద్దాం. ఇందుకై వేలాదిగా స్వర్ణోత్సవ విద్యా వైజ్ఞానిక మహాసభలకు హాజరై జయప్రదం చేద్దాం...

PRINTED AND PUBLISHED BY **KANDALA SATYA SUBRAHMANYA PRASAD**, ON BEHALF OF A. P.UNITED TEACHERS FEDERATION, PRINTED AT PRAJASAKTI PRINTERS&PUBLISHERS PVT LTD, D.NO.27-30-4, AKULAVARI STREET, GOVERNERPET, VIJAYAWADA- 520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT A. P.UNITED TEACHERS FEDERATION, 27-31-11, PALAPARTHIVARI VEEDHI, GOVERNERPET, VIJAYAWADA.520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH. **EDITOR : N. KUMAR RAJA**

## పద వికాసం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 | 2 | | ■ | 3 | 4 | | ■ |
| 5 | ■ | | ■ | 6 | ■ | | ■ | 7 |
| 8 | | ■ | 9 | | | ■ | 10 | |
| ■ | ■ | 11 | ■ | | ■ | 12 | ■ | ■ |
| 13 | | | | ■ | 14 | | | |
| ■ | ■ | | ■ | 15 | ■ | | ■ | ■ |
| 16 | | ■ | 17 | | | ■ | 18 | 19 |
| | ■ | 20 | ■ | | ■ | 21 | ■ | |
| ■ | 22 | | | ■ | 23 | | | ■ |

## ఆధారాలు

**అడ్డం**

1) ఉదయించే సూర్యుడి గుర్తు గల దేశం
3) ఆంధ్రలో పెద్దరేవు పట్టణం గల నగరం.
8) 'హాయి'లాంటి రాత్రి
9) మనుషుల మధ్య యుద్ధం కాదు కావలసింది స్నేహం.
10) పోటీ లాంటిది మరీ మంకుపట్టు
13) మార్క్స్ రాసి గ్రంథం
14) 'కలిసి బ్రతుకుదాం' అనే సిద్ధాంతం
16) 'లాభం' రాకపోతే
17) ఉన్నాడో లేదో తెలియని వాడు
18) జల చక్రంలో పైనుంచి పడేది
22) ఇంగ్లండు ముఖ్య పట్టణం
23) బ్రిటను

**నిలువు**

2) 'పక్వం'లాంటిది - స్వీటు చేసేటప్పుడు రావాల్సింది.
4) కూర
5) మర్యాద లేని పిలుపు. పెద్దలు చిన్న పిల్లల్ని పిలుస్తుంటారు.
6) సీత అత్తగారి నగరం
7) దీన్ని మత్తుమందుతో పోల్చుతారు.
11) పెట్టుబడి దేని కోసం - ఇందులో కూడా 'బడి' ఉంది.
12) ఫ్రాన్స్ విప్లవంలో ఏర్పడిన పరిపాలనా విభాగాలు
15) ఆవులు
16) నాలుగందాలా ఆనందమైంది.
20) తెలుగు స్టీమరు
21) మనపై పెత్తనం చేస్తున్న పరాయి భాష

(సమాధానాలు వచ్చే సంచికలో..)

## గత నవంబర్ నెల సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 రెం | 2 డో | ప్ర | 3 పం | చ | 4 యు | ద్ధం | ■ |
| 5 హి | ■ | లు | ■ | దెం | ■ | క్తి | ■ | 6 గు |
| 7 రో | గం | ■ | 8 ప్ర | కో | పం | ■ | 9 బూ | ర |
| షి | ■ | 10 గో | ■ | ళ్ల | ■ | 11 గో | ■ | జా |
| 12 మా | న | వు | డు | ■ | 13 గ | డ | గ | డ |
| నా | ■ | లు | ■ | 14 అ | ■ | వ | ■ | అ |
| 15 గ | బ్బ | ■ | 16 ప | వ | రు | ■ | 17 అ | ప్పా |
| సా | ■ | 18 ట్టు | ■ | స | ■ | 19 చీ | ■ | రా |
| కీ | ■ | 20 కొ | మ | రం | భీ | ము | ■ | వు |

## కవిత అమరజీవుల ఆశయాలు

– ఈదే వెంకట భరతకుమారి తిరువూరు, ఎన్.టి.ఆర్.జిల్లా

సగర్వంగా ఉపాధ్యాయులమంటూ
సమాజంలోన గౌరవం పొందుతున్న
నేటి మన ఉన్నతికి నాడు
సంఘం ఏర్పరచి
ఉద్యమ బాటలు వేసి
ఉద్యమించి ఉనికిని పెంచి
గతం నేర్పిన పాఠం నుండి
వర్తమానపు బాటలు వేసుకుంటూ
అమర జీవుల ఆశయాలు
మననం చేసుకుందాం
చెన్నుపాటి వర్ధంతి సభ
నిర్వహించుకుందాం
ఉద్యమ స్ఫూర్తిని పెంచుకుందాం
ఆశయాలకు అంకితమవుదాం

## పాఠకులకు సూచన

పూర్తి చేసిన పదవికాసం 2024 డిసెంబర్ 20లోగా ఐక్య ఉపాధ్యాయ పత్రికకు పోస్టు ద్వారా పంపాలి. కరెక్టుగా పూర్తి చేసి పంపిన పాఠకుల పేర్లు వచ్చే సంచికలో ప్రచురించ బడతాయి. సమాధానాలు పంపిన మొదటి పదిమందికి తగిన బహుమతి అందజేయబడుతుంది.

## పద వికాసం నవంబర్ నెల విజేతలు

1. **టి.రామలక్ష్మి,** రామరావుపేట, కాకినాడ జిల్లా
2. **వి.లక్ష్మి,** సూర్యారావుపేట, కాకినాడ జిల్లా
3. **ఈదే వెంకట భరతకుమారి,** తిరువుర్రు, ఎన్.టి.ఆర్.జిల్లా
4. **జె. శివలీల,** ఇబ్రహీంపట్నం, ఎన్.టి.ఆర్.జిల్లా
4. **కె.వరప్రసాద్,** ఇ–మెయిల్
5. **పి.సాయిరాజు,** అమీనపురం, వీరంకిలాకు, కృష్ణా జిల్లా
6. **షేక్ షావలి,** విడవలూరు (మం), నెల్లూరు జిల్లా
7. **జి.మమత,** కోట (పిఒ), తిరుపతి జిల్లా
8. **ఎం.శ్రీనివాస్,** రాజానగరం, తూర్పుగోదావరి

విజేతలకు అభినందనలు. బహుమతి త్వరలో అందజేయ బడుతుంది.

కథ

# అమ్మగది

బంధు మిత్రులు, అతిథులు రాకపోకలతో వామనరావు ఇల్లంతా ఒకటే హడావిడి. మూడు రోజులకిందటే వాళ్ళీ కొత్తింట్లోకి వచ్చారు. గృహప్రవేశానికి వచ్చి ఇంకా ఉన్న బంధువులు, అప్పుడు రాలేక ఇప్పుడొచ్చి శుభాకాంక్షలు చెప్తున్న వాళ్ళతో కొత్తిల్లు కళకళలాడుతోంది. వామనరావు, ఆయన భార్య పరిమిళ మొఖాల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. వచ్చిన వాళ్లందరికీ ఇంట్లో అణువణువూ చూపిస్తూ ఉప్పొంగిపోతున్నారు."ఈ ఫ్లోరింగ్ అంతా రాక్ మార్బుల్స్ రాజస్థాన్ నుంచి తెప్పిచ్చాం. ఇది కన్సీల్డు కిచెన్ ఇది మాస్టర్ బెడ్ రూమ్,పక్కది చిల్డ్రన్ బెడ్ రూమ్,ఆ తరువాద్ధి గెస్ట్ రూమ్,అది పూజ గది,మూలది స్టోర్ రూమ్ పైన లెఫ్ట్ కార్నర్లోది జిమ్, రైట్ సైడ్ ది పెట్ కార్నివాల్ టాప్‌లో ఉన్నది పెంట్ హౌస్, ఇది సిటౌట్, లోపలది కారిడార్, సైడుది డ్రాయింగ్ రూమ్, ఇదే చేపలు ఎక్వేరియం ప్లేస్" ఇలా అన్నీ చూపిస్తూ మురిసి పోతున్నారా భార్యా భర్తలు. లిఫ్ట్, పనిమనిషికి ఔట్ రూమ్, స్విమ్మింగ్ పూల్, విశాలమైన గార్డెనింగ్‌తో ఈ మూడు అంతస్తుల అందరినీ ఆకట్టుకుంది.

వామన రావు ఆదాయ పన్నుల శాఖలో ఉన్నతోద్యోగి. పరిమళ ధనిక కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన అమ్మాయి. పదిహేనేళ్ల నుంచీ అద్దిళ్ళల్లో ఉంటున్న వాళ్ళకీయిల్లు కలల సౌధం. వారం రోజులు గడిశాయి. హడావిడి సద్దుమణిగింది.



సిహెచ్.శ్రీనివాసరావు
తూర్పుగోదావరి

మధ్యాహ్న భోజనం ముగిసింది. "ఇక వెళ్ళొస్తాన్రా!" అంటూ తన బట్టలున్న చేతి సంచీ తీసుకుని బయలుదేరాడు వామనరావు మామయ్య గంగయ్య. గంగయ్య, వామనరావు తల్లి వేణమ్మకి స్వయానా అన్నయ్య. తనది పేదరికమైనా ఉన్నతమైన మనస్సు. వాళ్ళది ఒక చిన్న పల్లెటూరు. వారం రోజుల ముందే గంగయ్య ఇక్కడకొచ్చి చిన్నా,పెద్దా పనులు చక్కపెడుతూ వచ్చాడు. అన్ని పనులు మామయ్యే దగ్గరుండి చూసుకున్నాడు. మామయ్య చిన్నప్పటి నుంచీ వామనరావు కుటుంబానికి పెద్ద ఆసరా. తనకీ, చెల్లికీ మామయ్యంటే! ఓ మధురమైన బంధం, ఆత్మీయ భావం.

మామయ్య వెళ్తూ, వెళ్తూ హాల్లో బాబూ చిన్న మాట"ని వామనరావుని పిలిచాడు. "చెప్పు మామయ్యా!" అన్నాడు వామనరావు. ఇల్లు చాలా గొప్పగా కట్టేవు బాబూ!

అందరూ నీ యింటి గురించి చెప్పుకుంటుంటే ...ఇది మా మేనల్లుడిల్లని చాలా పొంగిపోయాను బాబూ!కాకపోతే..!?" అని సందేహిస్తుండగా!"చెప్పు!మామయ్యా! ఫర్వాలేదు!"అన్నాడు వామనరావు.

"ఈ ఇంట్లో... 'అసలు ఉన్నాడో?లేడో?తెలియని దేవుడికి' గదుంది. చిన్న పిల్లలకు,రాబోయే అతిథులకీ గదులున్నాయి. పనిమనుషులకి ఆఖరికి పెంపుడు కుక్కకీ, చేపల తొట్టికీ గదులున్నాయి కానీ, నిన్ను కన్న తల్లి కోసం ఎక్కడా తనకంటూ ఒక గది కనిపించడం లేదయ్యా?"అన్నాడు.

ఆ విషయం గురించే అంతగా ఆలోచించని వామనరావు మామయ్య మాటలకి షాకయ్యాడు.

"లంకంత ఇంటిలో ఆమె పడి మీదే తుంగ చాపేసుకుని పడుకుంటోంది. మీకోసం ఎవరైనా వస్తే!కనిపించకుండా తలుపెనకాలో! దొడ్డివైపు సందులోకో వెళ్ళిపోయి మరుగు చేసుకుంటోంది. తనకంటూ స్థిరమైన గదిలేక అది: 'గడీలాటలో మప్పీలా గడియకో చోటుకి మారుతోంది'. దాని అవస్థ చూస్తుంటే! పూర్వమున్న తాటాకింట్లోనే స్వేచ్ఛగా ఉందనుకుంటున్నాను. అసలు ఈ లోకంలో ఏమీ ఆశించకుండా అన్నీ ఇచ్చేది ఒక్క తల్లేరా! నీయంత చదువు జ్ఞానం నాకు లేకపోయినా? వయసు పంచిన అనుభవంతో చెబుతున్నాను. నేను తప్పుమాట్లాడుంటే మరోలా అనుకోవద్ద"ంటూ చెప్పి వెళ్ళిపోయాడు మామయ్య.

మామయ్య మాటలు మనస్సు లోతుల్లో తనకెక్కడో గుచ్చు కున్నాయి. ఉన్నపళంగా సోఫాలో చతికిల పడ్డాడు వామనరావు. తనను తాను సరిపెట్టుకోలేని నిస్సహాయతేదో అతన్ని ఆవరించింది. కాసేపటికి తేరుకుని కిటికీలోంచి అమ్మకోసం చూశాడు. సందులోంచి ప్రహరీ అవతలున్న బయటివాళ్ళెవరితోనో అమ్మ మాట్లాడుతోంది.

చిన్నగా మాటలు వినబడుతున్నాయి."అవును ఇది నా కొడుకిల్లు, ఆడు పెద్ద ఆఫీసరు. మా కోడలు కూడా చాలా భాగ్యమంతుల పిల్ల"అని ఇరుగూ పొరుగుతో కొడుకు,కోడలు గొప్పలు తెగ చెప్పేస్తోంది. వామనరావుకి కన్నీళ్లాగలేదు" ఈ లోకంలో ఏమీ ఆశించకుండా అన్నీ ఇచ్చేది తల్లి ఒకత్తేరా!". మామయ్య మాటలు గుర్తొచ్చాయి.

"అమ్మ మాకోసం ఎంత కష్టపడింది జీవితమంతా మాకోసం అరిగిపోయింది అమ్మ. మా బ్రతుకుల్లో వెలుగులు కోసం తాను కొవ్వొత్తిలా కరిగి పోయింది. తాను రక్తం మరిగించినా? కండలు కరిగించినా? మాకోసమే కదా!" అనుకుంటూ కళ్ళల్లో నీళ్లు ధారాపాతమౌతున్నాయి.

ఒక్కసారి తన బాల్యాన్ని నెమరు వేసుకున్నాడు. అప్పుడు వామనరావుకి ఆరేళ్ళు,చెల్లి సత్యకి మూడేళ్లు. పొద్దున్నే సద్దన్నం తిని నాన్న పద్దరాజు పనికెళ్లాడు. కాసేపటికే గుండె గుబేలుమనే కబురొచ్చింది. ఆ వార్త ఇంట్లో విషాదాన్ని నింపింది. పొలంలో పనిచేస్తున్న పద్దరాజుని మోటారు విద్యుత్ తీగ మృత్యువై కబళించింది.

పని ముగించుకుని కూలీడబ్బులుతో వస్తాడనుకున్న పద్దరాజు శవమై ఇంటికి వచ్చాడు. వేణమ్మ ఆచేతనతో దుఃఖ సాగరంలో మునిగిపోయింది. ఏం జరిగిందో తెలియని వయస్సులో ఆ అమాయక పిల్లలు బిత్తర చూపులు చూస్తున్నారు. ఆ హఠాత్ పరిణామం ఇంటిల్లిపాదినీ కృంగదీసింది. వేణమ్మ రోజులు గడుస్తున్నా బాధ నుంచి కోలుకోలేకపోతోంది. యజమాని లేక ఇల్లు అనాథైయింది. వేణమ్మకి మొదట్నుంచీ భర్తా, పిల్లలకి వండి పెట్టడం తప్ప మరోవ్యాపకం తెలియదు. క్రమ క్రమంగా ఇంట్లో అన్నీ నిండుకుపోయాయి. పిల్లలు కిరాణా కొట్టుకి సామాను వెళ్తే..." మీనాన్న వెయ్యి రూపాయలు ఇవ్వాలి. చెల్లించకుండానే పైకెళ్లి పోయాడు! ఇప్పుడు మీకరువిస్తే బాకీ ఎవరు తీరుస్తారని?"తిప్పి పంపించేశాడు షావుకారు.

ఇంట్లో రేపు అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. వేణమ్మకి ఇప్పుడు భర్త బెంగకన్నా ఆర్థిక సమస్యలే అసలు గుదిబండలయ్యాయి. అర్ధరాత్రి అంతా మాటు మణిగాక ఇంటి దూలానికి చీరకొంగు ముడివేస్తోంది వేణమ్మ. చేయి తగిలి అటకమీదున్న ఇత్తడి బిందె కింద పడి ఠంగుమని చప్పుడైంది. దీపకాంతి పిల్లల మొఖాల మీద పడుతోంది. నిద్రిస్తున్న ఆ పసిమొగ్గలు అమాయకంగా ముఖాలు చూసి కడుపుతరుక్కు పోయింది వేణమ్మకి. వీళ్ళను అనాథలు చేసి నేనిలా వెళ్లిపోవడం సమంజసమేనా?అనిపించింది. ఒక్క క్షణం పిల్లలకోసం ఆలోచించింది. తన నిర్ణయం మార్చుకుంది. ఉబుకుతున్న దు:ఖాన్ని ఆపుకోలేక బిగ్గరగా ఏడుస్తూ మంచంమీదున్న ఇద్దరిపిల్లల్ని గట్టిగా హత్తేసుకుంది. ఇలాంటి పిచ్చిపని ఇంకెప్పుడూ చేయకూడదనుకుంది.

ఒకరోజు అమ్మిచ్చిన పదిరూపాయాలతో టిఫిన్ తెచ్చుకోవడానికి వీధిచివరున్న హొటల్‌కి వెళ్లారు పిల్లలిద్దరూ. ఎంత సేపటికీ వాళ్ళు రాకపోవడంతో అమ్మ తెగ కంగారూపడిపోయింది. చాలా సేపటికి పిల్లలు బిక్క మొఖాలేసుకుని వచ్చారు. "టిఫినేదీ?" అంది అమ్మ.

"అక్కడ చాలా మంది ఉన్నారు. మేము చాలాసేపు నిలబడ్డాం! టిఫిన్లు అయ్యిపోయాయ"ని చెప్పారు పిల్లలు. "కాలం కలిసిరాపోతే తాడే పామై కరుస్తుందంటే!ఇదేనేమో?" అనుకొంది అమ్మ. అన్ని కష్టాలు మనకే రావాలా? అంటూ ఇంట్లో ఉన్న నూకలతో గబగబా ఉప్మా చేసి పెట్టి ఆపూటకి పిల్లల కడుపు ఆకలి తీర్చింది అమ్మ.

ఉన్నట్టుండి ఒక మెరుపులాంటి ఆలోచన ఆమె మనసును తట్టింది. అనుకున్నదే తడవుగా దాన్ని కార్యరూపం దాల్చింది వేణమ్మ. వాళ్ళింటిదగ్గరే టిఫిన్ సెంటర్ మొదలుపెట్టింది. కాలం, అవసరం దేన్నైనా నేర్పిస్తాయన్నట్టు ఆ వ్యాపారాన్ని తొందరగానే ఆకళింపజేసుకుని ముందుకెళుతోంది ఆమె. ఇప్పుడు వేణమ్మ టిఫిన్ వ్యాపారం బాగా సాగుతోంది. కుటుంబం ఏలోటూ లేకుండా గడిచిపోతోంది. రుచీ, శుచీ, శుభ్రం ఉండటంతో వేణమ్మ టిఫిన్ గిరాకీ పెరిగింది. పిల్లలిద్దరూ చక్కగా చదువుకుంటున్నారు.

వేణమ్మకి డబ్బులు చేయి తిరగడంతో కిరణాకొట్టుతో సహా భర్త చేసిన పాతబకాయిలన్నిటినీ తీర్చేయాలనుకొంది. "నాన్న ఎప్పుడో చేసిన బాకీలు ఇప్పుడు ఎవ్వరూ అడగట్లేదుగా? ఇప్పుడున్నపళంగా తీర్చడమెందుకు" అమ్మతో అన్నాడు వామనరావు.

"రుణ శేషం, శత్రుశేషం ఉండకూడదన్నారు పెద్దలు, మనం ఎప్పుడూ ఎవ్వరికీ బకాయిలుండిపోకూడదు. మళ్ళీ ఎన్ని జన్మలెత్తినా? తీర్చలేం"అంది అమ్మ. పద్దరాజు చేసిన అప్పులన్నీ వడ్డీతో సహా తీర్చేసింది వేణమ్మ.

తల్లి శ్రమకు ప్రతిఫలంగా అన్నట్టు పిల్లలిద్దరూ కష్టపడి చదువుకుని ప్రయోజకులయ్యారు. సత్య టీచర్ శిక్షణ పూర్తిచేసింది. ఆమెకు పక్కూళ్ళోనే మాష్టారుతో వివాహం జరిగింది. వామనరావు రక రకాలు ఉద్యోగాలు చేసి చివరికి ఆదాయ పన్నుల శాఖలో గ్రూప్ వన్ ఉద్యోగం సాధించాడు. డబ్బులు బాగా ఉన్న ఓ మోతుబరి వామనరావు గుణగణాలు, ఉద్యోగం చూసి ఏరికోరి మరీ వాళ్ళమ్మాయి పరిమళనిచ్చి వివాహం చేశాడు.

వామనారావు పదోన్నతుల్లో పెద్దస్థాయి ఉద్యోగంతో నగరానికి చేరుకున్నాడు. ఇక అక్కడే స్థిరపడాలని నిర్ణయించుకుని ఇల్లు కట్టుకోవడానికి సన్నాహాలు మొదలెట్టాడు. వాళ్లనుకున్నట్టుగా సకల సదుపాయాలు, సర్వ హంగులతో వారి కలల సౌధం సాకారమైంది. వామనరావు అమ్మను కూడా ఒప్పించి ఈ ఇంటికి తీసుకొచ్చేశాడు. గృహప్రవేశమై అనుకున్నట్టుగా అన్నీ సక్రమంగా జరిగిపోవడంతో ఆనందంగా, చాలా తెలికైపోయాడు వామనరావు. ఇంతలోనే మామయ్య తమ బాధ్యతని గుర్తు చేయడంతో గతాన్ని జోగుతున్న వామనరావు.. నెమ్మదిగా వర్తమానంలోకి తేరుకున్నాడు. అప్పటికే తెల్లవారిపోయింది.

తన ఆలోచన్ని పరిమళ ముందుంచాడు. ఒక మంచం, టేబుల్, కుర్చీ, టీపాయి హుటాహుటీన గెస్ట్ రూంలోకి తరలించేశారు. అమ్మా,నాన్న తాలూకు ఫోటోలన్నిటినీ ఆ గదిలో అలంకరించారు. స్టోర్ రూంలో మూలనున్న ఉన్న అమ్మ నులక మంచం, నాన్న వాడిన మడత కుర్చీ, ట్రంకు పెట్టి,బేట్రీ లైటు ఇవన్నీ కూడా ఆగదిలో సర్దేశారు.

పడి మీద కూర్చున్న వేణమ్మను పరిమళ వామనరావు చేరియొక చేయి పట్టుకుని మేడమీద అతిథి గది దగ్గరకు తీసుకొచ్చారు.గుమ్మం పైన 'అమ్మగది' అని పెద్దపెద్ద అక్షరాలతో రాసివుంది. అమ్మ కళ్ళల్లో ఆనంద భాష్పాలు పుత్ర వాత్సల్యమై కురిశాయి. గదిలోకి కూడా తీసుకెళ్లారు కొడుకు కోడలు. గది నిండా ఉన్న ఆమె తాలూకూ వస్తువులు,స్మృతుల్ని తేరిపార చూస్తూ పరవశించిపోయింది. కొంచేసేపు ఆమె కన్నీళ్లే మాట్లాయి. తమాయించుకుని తెరుకున్నాక "ముసిలి దాన్ని ఏపడిమీద తలదాచుకున్నా! రోజెళ్లిపోతుంది.

ఈ గదులు,ఏసీలు గట్రా నాకెందుకురా! బాబూ"అంది. వామన రావుకి మామయ్య మాటలు మళ్ళా గుర్తొచ్చాయి.'లోకంలో ఏమీ ఆశించకుండా అన్నీ ఇచ్చేది అమ్మ ఒకత్తే!'ని. నాటినుంచీ వామనరావు అందరికీ చెప్తూనేవున్నాడు ఇంట్లో పూజగదికంటే ముందుగా ఉండాల్సింది 'అమ్మగది' అని.



## ఉద్యోగులను, ఉపాధ్యాయులను విస్మరించిన

# రాష్ట్ర బడ్జెట్



కె.యస్.లక్ష్మణరావు
శాసన మండలి సభ్యులు

2024 జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలి బడ్జెట్‌ను నవంబర్ 11న రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ శాసన సభలో, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శాసనమండలిలో ప్రతిపాదించారు. వ్యవసాయ మంత్రి కె.అచ్చం నాయుడు శాసన సభలో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఆర్థిక మంత్రి ప్రసంగంలో 2019-2024 మధ్య గత ప్రభుత్వ పాలనలో ఆర్థిక రంగంలో ఏర్పడిన పరిస్థితులు వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల దుర్వినియోగం జరిగిందని, సహజ వనరుల దోపిడీలో రాష్ట్ర ఆదాయానికి గండిపడిందని, పరిమితికి మించి ఋణాలను అధిక వడ్డీ రేట్లకు తీసుకున్నారని, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు మళ్లించారని, స్థానిక సంస్థల నిధులు మళ్లించారని, వివిధ పనులకు చెందిన బిల్లుల బకాయిలు, ఉద్యోగులకు బకాయిలు పేరుకుపోయాయని మొ॥ అంశాలు వివరించారు. ఈ వివరాలను గత జూలై నెలలో జరిగిన 'ఓట్ ఆన్ అకౌంట్' బడ్జెట్ సందర్భంగా ప్రవేశ పెట్టిన శ్వేతపత్రాలలో కూడా వివరించారు.

### ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 22వేలకోట్ల బకాయిలు ఉన్నామని ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో మరియు శ్వేతపత్రంలో కూడా ప్రస్తావించారు. వాటిని కొంతమేరకైనా చెల్లించడానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదు. 2,94,427 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఎటువంటి ప్రతిపాదనలు లేవు. 12వ వేతన సంఘం నియామకం ఇప్పటికే జరిగి ఉండాలి. గత ప్రభుత్వం 11వ వేతన సంఘం బకాయిలు చెల్లించకపోగా, 12వ వేతన సంఘం గురించి పట్టించుకోలేదు. ఈ బడ్జెట్‌లో 12వ వేతన సంఘం గురించి ఎటువంటి ప్రస్తావనలేదు. ప్రభుత్వం ఐ.ఆర్. గురించి కూడా ఆలోచన చేయలేదు.

2003 ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నం.57 ప్రకారం పాత పెన్షన్ విధానం షుమారు 10వేల మందికి అమలు చేయాలి. దానిని ప్రస్తావించలేదు. కాంట్రాక్ట్ ఉద్యోగులు, అధ్యాపకులు రెగ్యులరైజేషన్ ప్రక్రియ కొనసాగింపుకు సంబంధించిన ప్రస్తావనలు లేవు.

### విద్యారంగం కేటాయింపులు

రాష్ట్ర బడ్జెట్‌లో పాఠశాల విద్యకు 29,909 కోట్లు, ఉన్నత విద్యకు 2,326 కోట్లు కేటాయించారు. డిఎస్‌సి ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. మొత్తం బడ్జెట్ వ్యయంతో పోలీస్తే పాఠశాల విద్యకు కేటాయింపులు గతంకంటే తగ్గాయి. గతంలో షుమారు 12% ఉండగా ఇప్పుడు 9.8%గా వున్నాయి. పాఠశాలలో మౌలిక సదుపాయాలను మరియు విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు చేపడుతుందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల బోధనపై మరింత దృష్టి పెట్టేందుకు వీలుగా అనవసరమైన 'యాప్'లను తొలగించడం ద్వారా ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గిస్తామని చెప్పారు. కాని ఆచరణలో ఈ చర్యలు సమగ్రంగా లేవు. విద్యాశాఖ మంత్రి వర్యులు ఉపాధ్యాయ సంఘాలతో సమగ్రంగా చర్చించి వీటిపై చర్యలు తీసుకోవాలి. ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇస్తామని బడ్జెట్‌లో తెలిపారు. వీటితోపాటు ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయవల సిందిగా విద్యార్థులు కోరుతున్నారు.

### మౌలిక రంగాలకు కేటాయింపులు

రాష్ట్రంలో మౌలిక రంగాలైన ఇరిగేషన్, వ్యవసాయ, ఇంధనం, రోడ్ల నిర్మాణం తదితర మౌలిక రంగాలకు కేటాయింపులు తగిన విధంగా లేవని నిపుణులు వ్యాఖ్యానించారు. జలవనరుల శాఖకు 16,705 కోట్లు కేటాయించినప్పటికి కీలకమైన ప్రాజెక్టులకు తగిన విధంగా కేటాయింపులు జరగలేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి 63కోట్లు, వెలిగొండ ప్రాజెక్టుకు 393 కోట్లు మాత్రమే కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయంగా 'అన్నదాత సుఖీభవ' పథకానికి కేవలం 1000 కోట్లు కేటాయించారు. రైతులకు గిట్టుబాటు ధర, రైతులకు ఉచిత భీమా, కౌలు రైతుల రక్షణ మొ॥ అంశాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు.

### యువతకు ఉపాధి కల్పన

రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్ర సమస్యగా ఉన్నది. డిఎస్‌సి 16,347 పోస్టులతో ప్రకటన తప్ప మిగిలిన ఉద్యోగుల భర్తీ ప్రస్తావనలేదు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని గాని, నిరుద్యోగభృతి కల్పిస్తామని గాని బడ్జెట్‌లో పేర్కొనలేదు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో షుమారు 2లక్షలపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. యువత నైపుణ్యాభివృద్ధికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శాశ్వత ప్రాతిపదికపై ఒక నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయవలసి వున్నది.

బడ్జెట్‌ను మొత్తంగా పరిశీలించినప్పుడు సాధారణ బడ్జెట్‌గానే ఉన్నది. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతుల్యంగా తీసుకు వెళ్లవలసిన అవసరం ఉన్నది. 'సూపర్ సిక్స్' పథకాల అమలుకు తగిన కేటాయింపులు లేవు. రాజధాని అభివృద్ధికి ప్రపంచ బ్యాంక్ ఇచ్చే 15వేల కోట్ల ఋణం గ్రాంట్, ఋణమో స్పష్టతలేదు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే కాలంలో స్పష్టమైన విధానాలతో అభివృద్ధి సంక్షేమం సాధించే దిశగా బడ్జెట్ రూపకల్పన జరగాలంటే కేంద్ర ప్రభుత్వ సహాయం అవసరం.

# అంతా మన చేతుల్లోనే...



ఎన్.వెంకటేశ్వర్లు
యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు

మన చేతుల్లో ఏమీ లేదు. ఏమీ చేయలేము ఇలా అనుకోవటం వింటూ ఉంటాం. మన చేతుల్లోనే అంతా ఉంది. మనమే ఏమైనా చేయగలం అని కూడా అనుకోవడం వింటూ ఉంటాం. నిజంగా మనం ఏమి చేయలేమా? మన చేతుల్లో ఏమీ లేదా ఒకసారి చుట్టూ జరుగుతున్న పరిణామాలను పరిశీలిద్దాం.

★2020లో కరోనా వైరస్ మనిషిని చుట్టి ముట్టింది. లక్షలాది మంది చనిపోయారు. మన చేతుల్లో ఏమీ ఉందిలే అనుకోకుండా వ్యాక్సిన్‌ను కనుగొన్నారు. కరోనా వైరస్‌ని సాధారణ జలుబుగా మార్చేశారు.

★ తమిళనాడులో శ్యాంసంగ్ కార్మికులు 37 రోజుల సమ్మె చేసి, 'నో యూనియన్' అనే నినాదాన్ని త్రిప్పికొట్టి తమ హక్కులను, పని గంటలు, జీతాల పెంపుదల, కంపెనీ రక్షించుకోవడం ... అన్ని ఇలా పోరాటంతో సాధించుకున్నారు.

★ ఇక మన రాష్ట్రంలో 42 రోజులు అంగన్వాడీ సమ్మె, బెదిరింపులు ప్రయోగించినా రోడ్లమీదే వంట వార్పు చేసారు. అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, వేతనాలను పెంచాలని, పిల్లలకు పోషకాహారం అందించాలనే డిమాండ్లు సాధించుకున్నారు.

★ 27 కోట్ల పాలసీదారులు, 39 లక్షల కోట్ల ఆస్తులు, దేశ అభివృద్ధికి 43 లక్షల కోట్లు పెట్టుబడి పెడుతున్న ఏకైక ప్రభుత్వ బీమా రంగ సంస్థ ఎల్ఐసి. కేంద్ర ప్రభుత్వం ఐ.పి.ఓ ద్వారా ఎల్ఐసి వాటాలను అమ్మకానికి పెట్టింది. ఈ దేశీయ ప్రభుత్వ భీమా రంగాన్ని ఎల్ఐసి ఉద్యోగులు, ఏజెంట్లు అందరూ పోరాటాలు చేసి భీమా రంగాన్ని ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకున్నారు.

★ ఏపి ఎస్.ఆర్.టి.సి. రాష్ట్ర ప్రగతికి చక్రం. ఒకనాడు లాభాలతో నడిచింది. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు అప్పులు తిరిగి చెల్లించకపోవడం వల్ల ఆర్టిసి నష్టాల్లో క్రమంగా కూరుకు పోయింది. ఈ ఆర్టిసిని రక్షించడం కోసం చెయ్యెత్తండి-బస్సు ఎక్కండి అనే నినాదం తీసుకుని అదనపు గంటలు పని చేశారు. ఆర్టిసిని ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకున్నారు.

★ 35 వేల ఎకరాలు, 22 వేల శాశ్వత ఉద్యోగులు, 20వేల కాంట్రాక్టు ఉద్యోగులు, 35 వేల కోట్ల ఆస్తులు, ఈ మధ్యనే 100 మెగా టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తి చేసుకున్న ప్రభుత్వ రంగ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు మాత్రమే కాదు ఆంధ్రుల ఊపిరి.

ఇప్పుడు ఈ ఆంధ్రుల ఊపిరిని కార్పొరేట్ల కోసం అత్యంత తక్కువ ధరకు అమ్మకానికి పెడితే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆంధ్రుల హక్కు పోరాటంలో అమరులైన 32 మంది త్యాగాల స్ఫూర్తితో పోరాటం చేస్తున్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు మాత్రమే కాదు, ఆంధ్రుల ఊపిరి. దీనిని రక్షించుకోవడస్త్రం కోసం కార్మికులు ప్రాణాలు ఒడ్డి పోరాడుతున్నారు

★ 2 లక్షల క్యాడర్ స్ట్రెంత్, ఏ పాఠశాలలోనైనా మినిమంగా 100 మంది విద్యార్థులు, సామాజిక న్యాయం నైతిక విలువలు, మంచి పౌరులను తయారు చేసే కేంద్రాలుగా ప్రభుత్వ పాఠశాలలు విరాజిల్లిన రోజులు ఉన్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో పాఠశాలలను ప్రభుత్వాలే బలహీనపరిచి, యాక్సెస్ పేరుతో ఇబ్బడి ముబ్బడిగా ప్రారంభించారు.

విద్యావ్యవస్థను ధ్వంసం చేసిన జీవో 117. ఇదేదో కాక తాళీయంగా వచ్చిన జీవో కాదు. అప్పుల కోసం షరతులకు లోబడి తెచ్చుకున్న జీవో. 12వేలు పైచిలుకు ప్రాథమిక పాఠశాలలో ఒక్క టీచర్ బోధన చేస్తున్నారు. ఎన్రోల్మెంట్ క్రమేపి తగ్గుతుంది. ఉపాధ్యాయుల సంఖ్య గతం కంటే తగ్గిపోయింది. ప్రతి నెలా సర్దుబాటు ముందు కొచ్చింది.

యాప్‌లు, శిక్షణలు, టెలి కాన్ఫరెన్స్‌ల హడావుడి పెరిగి పోయింది. ఒక పంచాయతీలోనైనా మంచి బడి ఉంటే బాగుంటుందనే మరొక ప్రతిపాదన ముందుకు వచ్చేస్తుంది. బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పి బోధనకి దూరం చేస్తే పిల్లలే మరొక పాఠశాలలు వెళ్లే పరిస్థితికి వచ్చింది.

విశాఖ ఉక్కుని, ఆర్టీసీని, భీమా రంగాన్ని ఉద్యోగులు రక్షించు కున్నారు. మరి ప్రభుత్వ బడిని ఎవరు రక్షించాలి? పాలకుల నిర్బంధాలు, బోధనేతర కార్యక్రమాలు వీటి గురించి మాట్లాడు కోవడం, పోట్లాడటం చేయాల్సిందే. కానీ దానికే పరిమితమైతే బడి బ్రతకదు. ప్రభుత్వ బడిని ప్రజల సహకారంతో బ్రతికించుకోవాలి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ బడిని తీర్చిదిద్దాలి. పోదాం పదండి ప్రజల దగ్గరికి - విద్యార్థులతో మాట్లాడదాం - దేశ అవసరాలకు తగ్గ మాన వనరులను తయారు చేద్దాం. మనకి ఇది పరీక్షా సమయం. మన చేతుల్లో ఏమీ లేదు అనే నిరుత్సాహపు ఆలోచన వదిలి మన చేతుల్లోనే అంతా ఉందనే ప్రోత్సాహపు చైతన్యం వైపు కదులుదాం. ★



# నిరంతర కార్యశీలి, ఆదర్శ ఉద్యమ నేత

# ఎం.వి.కె.దత్



మన ఉద్యమ నాయకులు

ఐదు దశాబ్దాల యుటియఫ్ మహా ప్రస్థానంలో తమ జీవితాలను ఉద్యమానికి అంకితం చేసిన త్యాగధనులు ఎందరెందరో వున్నారు. వారిలో అగ్రగణ్యులైన ఆదర్శ నేతలు కొందరు కాగా, వారిలో ఒకరు ముదునూరు అక్షయకుమార్ దత్. ఆయన ఆదర్శ ఉద్యమ నేత, ఉత్తమ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త కూడా. కనుకనే విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు వివిధ ప్రజా సమూహాలకు ఆయన చిరస్మరణీయుడయ్యారు!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను, ఆ తదుపరి తెలంగాణా రాష్ట్రంలోను యుటియఫ్ ఉద్యమానికి, పలు ప్రజాతంత్ర ఉద్యమాలకు నాలుగున్నర దశాబ్దాలకుపైగా దత్‌గారు అందించిన సేవలు అమూల్యమైనవి, నిరుపమానమైనవి.

**అభ్యుదయ కుటుంబం :**

దత్‌గారి జన్మస్థలం కృష్ణా జిల్లా, ముదునూరు గ్రామం. ఆ గ్రామం పేరే వారి యింటి పేరుగా వచ్చింది. 1946 అక్టోబర్ 21న ముదునూరు రామారావు, అనసూయమ్మ గార్లకు జన్మించిన ప్రథమ సంతానం దత్‌గారు. రామరావుగారి బాబాయి ఆ గ్రామ కరణం కాగా, రామరావుగారి తండ్రి చంద్రశేఖరయ్య గారిని చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు గ్రామ పెద్దగా పరిగణించేవారు. కుటుంబ సమస్యలు, గ్రామ సమస్యలపై ఆయన సలహా కోసం ప్రజలు నిరంతరం వస్తుండేవారు. తమ కుటుంబ సనాతన సాంప్రదాయాలను ప్రక్కనబెట్టి అలా వచ్చిన వారందరిని ఆదరించి, భోజనాది సౌకర్యాలను అందించేవారు. అంతేగాదు వివిధ సామాజిక వర్గాలకు చెందిన పలువురు విద్యార్థులకు చంద్రశేఖరయ్య గారి యిల్లు ఒక గురుకులంవలె ఉండేది. ఆ విధంగా అప్పటికే అభ్యుదయ భావాలకు ఆలంబనంగా వున్న వారి కుటుంబ నేపథ్యం దత్‌గారిపై నిస్సందేహంగా ప్రభావం చూపింది.

దత్‌గారి బాల్యం కొద్దికాలం మద్రాసు నగరంలో గడిచింది. ఆ తదుపరి 1950 దశకం ప్రారంభంలో వారి కుటుంబం గుంటూరు పట్టణానికి వచ్చి స్థిరపడిపోయింది. దత్‌గారి తండ్రి రామారావు గారు గుంటూరులోనే 25 సంIIలుపైగా ట్యూషన్స్ చెప్పి, పదిమంది సభ్యులున్న కుటుంబాన్ని క్రమశిక్షణాయుతంగా పోషించారు.

సామాజిక దృక్పథం, సేవ దత్‌గారికి వంశపారంపర్యంగా వచ్చిన ఆస్థి, లక్షణం. తాత, తండ్రి అనుసరించిన బాటలో పయనించడం ఆయన ఆశయం. జీవిత చరమాంకం వరకు ఆయన దానిని నిర్విఘ్నంగా కొనసాగించారు. అంతేగాదు తన కుటుంబ సభ్యులలోను శాస్త్రీయ దృక్పథాన్ని, వామపక్ష భావజాలాన్ని నెలకొల్పేందుకు కృషి చేసారు. ఆచరణలో అన్నింటా వారికి తానొక రోల్ మోడల్‌గా వ్యవహరించేవారు.

తత్ఫలితంగానే ఆయన సోదరులు – రాధేశ్యామ్, ప్రమోద్‌లు, సోదరి పద్మశ్రీ బ్యాంకు ఉద్యోగులైయుండి, వామపక్ష కార్మికోద్యమం (సిఐటియు)లో నేటికి కార్యకర్తలుగా, నాయకులుగా పనిచేస్తున్నారు. ఒక సోదరుడు, ఒక సోదరి, ఒక కుమారుడు వర్ణాంతర వివాహాలు చేసుకుని ఆదర్శ కుటుంబీకులుగా వున్నారు.

దత్‌గారికి 1975 డిసెంబర్ 7న రేపల్లె వాసియైన లలితగారితో వివాహం జరిగింది. దత్‌గారికి తొలుత నుండి కుటుంబ సభ్యుల నుండి లభించిన సహకారం ఒక ఎత్తైతే, సతీమణి లలిత గారు అందించిన తోడ్పాటు మరో ఎత్తు. కుటుంబం మొత్తాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో దత్ గారితోపాటు లలితగారి పాత్ర ప్రశంశనీయమైనది. ఆమె అందించిన సంపూర్ణ సహకారంతోనే ఆయన యుటియఫ్ ఉద్యమంలో వివిధ బాధ్యతలలో యిన్నేళ్ళు పని చేయగలిగారు. యుటియఫ్ కార్యకర్తలకు ఆమె చూపిన ఆత్మీయ ఆదరణ మరువలేనిది.

**ఉత్తమ ఉపాధ్యాయుడు :**

తన చదువును గుంటూరు హిందూ కాలేజీలో పూర్తిచేసిన దత్ గారు తండ్రి అడుగుజాడలలో నడచి, మంచి ఉపాధ్యాయుడు కావాలనే కోరికతో బందరు కాలేజీలో బిఇడి పూర్తి చేసారు. ఆపై హైదరాబాద్‌లోని బిహెచ్ఇఎల్ ప్రాంతములో వున్న జిల్లా పరిషత్ హైస్కూలులో లెక్కలు మాష్టారుగా పనిచేసారు.

పట్టణాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు విద్యా వసతులు మెండుగా వుంటాయని, పల్లెలలో నివసించే విద్యార్థులకు మెరుగైన విద్య లభించాలంటే తనవంటివారు గ్రామీణ పాఠశాలల్లో పనిచేయడం సరియైనదవుతుందని భావిస్తున్న దత్‌గారికి అటువంటి అవకాశం లభించింది. నెల్లూరు జిల్లా కావలి తాలూకాలోని "చాకలికొండ" అనే గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాలలో గణితోపాధ్యాయుడు కావాలనే పత్రికా ప్రకటనను చూసిన దత్‌గారు దానిని మంచి అవకాశంగా భావించారు. ఆ ఊరికి వెళ్ళాలంటే కొన్ని కిలోమీటర్లు నడచి వెళ్ళాల్సి వుంటుందని తెలిసినా పట్టుదలతో ఆ పాఠశాలలో చేరి, అక్కడి పిల్లలకు విద్యా బోధన చేయడంలో ఎంతో తృప్తిని, ఆనందాన్ని పొందారు. పాఠశాల సమయం తరువాత కూడా ప్రత్యేక తరగతులు తీసుకుంటూ అక్కడి విద్యార్థులకు చదువుతో పాటు, లోకజ్ఞానం, శాస్త్రీయ ఆలోచనలను గురించి బోధించేవారు. అనుకోని పరిస్థితులలో దత్‌గారి తండ్రి రామారావుగారు అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ (ఎయిడెడ్)లో 1972-73లలో లీవ్ వెకెన్సీలో పనిచేయవలసి వచ్చినది. అది దత్‌గారు అదే పాఠశాలలో 1973 చివరలో గణితోపాధ్యాయుడుగా నియామకం పొందడానికి దోహదపడింది.

విద్యార్థులకు కేవలం గణిత పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా బలహీన వర్గాల విద్యార్థులకు పలు విధాలుగా చేయూతనిస్తూ ప్రోత్సహించేవారు. పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా రిటైరై రెండు దశాబ్దాలవుతున్నా అమరావతిలోనేగాక చుట్టుప్రక్కల గ్రామాల ప్రజానీకంలో దత్‌గారికి నేటికీ విశేషమైన గుర్తింపు వున్నది. ఆయన మరణానంతరం 2023 డిసెంబర్ 10వ తేదీన ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు ఉపాధ్యాయులకంటే ప్రజలే అధిక సంఖ్యలో హాజరవడం అందుకు తార్కాణంగా పేర్కొనవచ్చు.

**యుటియఫ్‌లో ప్రస్థానం :**

1975 సం॥లో యుటియఫ్ సభ్యునిగా చేరిన దత్‌గారు అనతి కాలంలోనే కార్యకర్తగా మారారు. 1977లో ఖమ్మంలో జరిగిన యుటియఫ్ రాష్ట్ర మహాసభలకు హాజరై స్ఫూర్తిని పొందిన ఆయన ఉద్యమ జీవితాన్ని ప్రారంభించి తుది శ్వాసవరకు అందులో కొనసాగారు. ఆ మహాసభల సందర్భంలో అమరజీవి రామిరెడ్డి గారితో ఏర్పడిన పరిచయం దత్‌గారిలో మరికొన్ని కొత్త భావాలు చోటు చేసుకునే దానికి దోహదపడింది. అటుపై నిబద్ధతతో పనిచేస్తూ సమితి, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకునిగా ఎదిగారు.

యుటియఫ్ రాష్ట్ర కార్యాలయం 1999వరకు విజయవాడలో వుండేది. అధ్యక్షులైన డి.రామిరెడ్డిగారు 1982లో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందారు. దానితో హైదరాబాద్‌లో యుటియఫ్ ఉపకార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని రామిరెడ్డిగారు పనిచేయవలసి వచ్చింది. ఆ క్రమంలో రామిరెడ్డిగారికి సహకరించడానికి దత్‌గారు 1985లో 2 సం॥లు జీత నష్టపు సెలవు పెట్టి, కుటుంబ సమేతంగా హైదరాబాద్‌కు మకాం మార్చి యుటియఫ్‌కు పూర్తికాలం సేవలందించారు. ఆ కాలంలోనే ఆయన విద్యారంగ సమస్యలపై విశ్లేషణాత్మక అధ్యయనానికి పూనుకోవడం జరిగింది. తదుపరి కాలంలో అకడమిక్ సెల్ కన్వీనర్‌గా, రాష్ట్ర కోశాధికారి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా, ఐక్యఉపాధ్యాయ పత్రిక సంపాదకవర్గ సభ్యునిగా పలు బాధ్యతలను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు.

2000 దశకంలో గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షునిగా పనిచేయవలసి వచ్చినది. అమరావతి హైస్కూల్‌లో పనిచేస్తున్నప్పటికి ఉద్యమ అవసరాలరీత్యా కుటుంబ నివాసాన్ని గుంటూరు కార్యాల యానికి మార్చారు. ఆ కాలంలోను రాష్ట్ర కేంద్రంలోని వివిధ విభాగాలకు తన సహకారాన్ని అందిస్తూ వచ్చారు. యుటియఫ్‌లో పలు బాధ్యతలను నిర్వర్తిస్తున్నా పాఠశాల విధులలో ఎప్పుడూ అలసత్వం చూపేవారు కాదు. కనుకనే ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తింపును నిలబెట్టుకోగలిగారు.

2004 అక్టోబరులో రిటైన తరువాత పలు అవసరాలరీత్యా హైదరాబాద్‌కు కుటుంబ నివాసాన్ని మార్చారు. రాష్ట్ర కార్యాలయంలో తనకు అప్పగించిన వివిధ కర్తవ్యాలను నిర్వహిస్తుండేవారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణా రాష్ట్ర యుటియఫ్ ఆవిర్భవించింది. ఆ సమయంలో ఆ ఉద్యమం నిలదొక్కుకోవడంలో సీనియర్ నాయకుడైన దత్‌గారి సహకారం ఎంతగానో ఉపయోగపడింది. 2016 నుండి 5 సం॥ల పాటు రాష్ట్ర కార్యాలయంలో నివాసముండి కార్యాలయ నిర్వహణలోను, సంఘ కార్యక్రమాలను సమన్వయం చేయడంలోను ప్రధాన బాధ్యులకు సహకరించారు. ప్రత్యేకించి 2007 నుండి పున:ప్రారంభ మైన శాసనమండలికి జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజక వర్గాల ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా సమన్వయ కర్తగా విశేష సేవలందించారు.

**అకడమిక్ సెల్ :**

"అధ్యయనం, అధ్యాపనం, సామాజికస్పృహ" అనే యుటియఫ్ సూత్రాలకు అనుగుణంగా విద్యారంగ విషయాలను, బోధనా పద్ధతులను అధ్యయనం చేయడం, వాటిని ఉపాధ్యాయులకు అందివ్వడం బాధ్యతగా భావించిన యుటియఫ్ 1985 జులైలో "అకడమిక్ సెల్"ను ఏర్పాటు చేయడం జరిగింది. దానికి దత్‌గారు కన్వీనర్‌గా వ్యవహరించారు. ప్రత్యామ్నాయ బోధనా పద్ధతులపై మధ్యప్రదేశ్‌లోని ఔషంగాబాద్‌లో "ఏకలవ్య" సంస్థ నిర్వహించే శిక్షణా తరగతులలో రామిరెడ్డిగారు, దత్‌గారు పాల్గొనేవారు. అక్కడ అధ్యయనం చేసిన "No Cost, Low Cost teaching aids" వంటి అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణా తరగతులను నిర్వహించేవారు. పేద విద్యార్థులకు తోడ్పడే విధంగా "10వ తరగతి మోడల్ పేపర్లు" ప్రచురణలో ఆయనే ప్రధాన బాధ్యత వహించేవారు.

1986లో వచ్చిన నూతన విద్యా విధానం, 2020లో వచ్చిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఇపి) విద్యా లక్ష్యాలు అందరికి సమానంగా వుండాలనే సూత్రానికి ఎలా తూట్లు పొడుస్తుందో సవివరంగా ఉపాధ్యాయులకు బోధించేవారు.

**సామాజిక కార్యక్రమాలు :**

సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా దివిసీమ ఉప్పెన బాధితులకు సహాయం, తెలంగాణాలో కరువు ఏర్పడినప్పుడు "గంజి కేంద్రాలు" నిర్వహణ, కరోనా కాలంలో ప్రజలకు ఆహారం, వైద్య సహాయం అందివ్వడం వంటి పలు కార్యక్రమాలను యుటియఫ్ చేపడుతూ వచ్చింది. ఉభయ రాష్ట్రాలలో కోట్లాది రూపాయలు సేకరించి కరోనా బాధితులను ఆదుకున్న సందర్భంలో దత్‌గారు ఒక్కరే 4లక్షల రూపాయల విరాళాలు సేకరించి, అందివ్వడం ఆయనకున్న సామాజిక స్పృహకు అద్దంపడుతుంది.

**ప్రజాతంత్ర ఉద్యమాలకు మద్దతు :**

దత్‌గారు పనిచేసిన అమరావతి, గుంటూరు, హైదరాబాద్‌లలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు, మహిళా సంఘం వంటి పలు ప్రజా సంఘాలు చేపట్టే కార్యక్రమాలకు వెన్నుదన్నుగా వుండేవారు. ఆ ప్రజా సంఘాలలో యువత పనిచేయవలసిన అవసరాన్ని వివరించి, వారిని ప్రోత్సహించేవారు.

**వ్యక్తిత్వం :**

దత్‌గారిది ఆదర్శవంతమైన వ్యక్తిత్వం. నిబద్ధతతో, దృఢచిత్తంతో కార్యకలాపాలను సాగించేవారు. చిరునవ్వే ఆయనకు ఆభరణం. మంచి స్నేహశీలి. కాగా, ఎంత సన్నిహిత స్నేహితుడైనను, ఎంత పెద్ద నాయకుడైనను విషయపరంగా విభేదిస్తూ నిర్మొహమాటంగా మాట్లాడేవారు. ఆయన నిరంతర అధ్యయనశీలి, మంచి వక్త, నిబద్ధత, నిజాయితీ, నిరంతర కార్యశీలతతో అందరికి స్ఫూర్తిదాయకంగా వుండేవారు. ప్రతి ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్తగా మారాలని ఆకాంక్షించేవారు. సంఘ నిర్మాణంలో నిక్కచ్చిగా వుండాలని ఉద్బోధించేవారు. వయస్సుతో సంబంధం లేకుండా ఏ తరం వారితోనైనా కలిసి పనిచేసే వ్యక్తిత్వం దత్ గారికి స్వంతం.

ఆదర్శ ఉపాధ్యాయునిగా సాధారణ ఉపాధ్యాయులకు బోధనా మెళుకువలను, ఉద్యమ నేతగా కార్యకర్తలకు ఉద్యమ పాఠాలను బోధించిన దత్‌గారు 2023 డిసెంబర్ 2న మరణించిన అనంతరం భౌతికకాయం వైద్య విద్యార్థుల అధ్యయనానికై అందివ్వడంతో ఆయన నిజంగానే అమరుడయ్యారు.

# చెన్నుపాటి ఆశయాలకు పునరంకితమవుదాం



సమాజాభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేసిన మహా నీయుల జయంతులు, వర్ధంతులు జరుపుకొని వారి ఆశయాలను నెమరువేసుకుంటూ ముందుకు సాగడం ఉద్యమాల సాంప్రదాయం. వీటిని కొందరు మొక్కుబడిగా జరుపుతారు. యుటియఫ్ దీనిని కర్తవ్యంగా భావిస్తుంది. వర్తమానంలో ఉద్యమించాలంటే చరిత్ర పరిజ్ఞానం ఉండాలి. వాటి పాఠాలతో గుణపాఠాలతో ముందుకు సాగాలి.

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి జీవితం ఉద్యమాలకు అంకితం. 1947లో స్వాతంత్ర్యం పచ్చినా ప్రభుత్వం అనుమతి లేకుండా ఉపాధ్యాయులు సంఘాలు పెట్టుకోరాదనే చట్టాలను 1952 వరకు అమలు జరిపారు. దానికి వ్యతిరేకంగా చెన్నుపాటి మద్రాసు హైకోర్టులో రిట్ వేశారు. ఆ కోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. సంఘాలు పెట్టుకోవడం రాజ్యాంగవరంగా లభించిన ప్రాథమిక హక్కని, దానికి ప్రభుత్వ అమమతి అవసరం లేదని తీర్పు చెప్పింది. ఈ తీర్పువల్ల దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంఘం పెట్టుకునే స్వేచ్ఛ లభించింది. అందుకే చెన్నుపాటి ఉద్యమ పితామహుడ య్యాడు. ఆయన వేసిన ఉద్యమ బీజమే నేడు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది.



**ఎన్.కుమార్ రాజా**
ప్రధాన సంపాదకులు
ఐక్యఉపాధ్యాయ

చెన్నుపాటి 1910 జనవరి 10న గుంటూరులో జిల్లా చిలకలూరిపేట మండలం, వేలూరు గ్రామంలో జన్మించారు. హయ్యర్ ట్రైనింగ్ పూర్తి అయిన తర్వాత సాధారణ హయ్యరు గ్రేడు టీచరుగా జీవితాన్ని ప్రారంభించారు. నాడు జీతల రూ.15/-లు. ఏ అలవెన్సులూ లేవు, జీతం. నెలనెలా వస్తుందనే గ్యారంటీ లేదు. ఉపాధ్యాయులు తాలూకా స్థాయిలోనే మేనేజ్మెంట్ వారి సంఘాలు పెట్టుకోవాలి. మేనేజ్‌మెంట్ అనుమతి పొందాలి. ప్రభుత్వాన్ని విమర్శించకూడదు. నిరసన వ్యక్తం చేస్తే ఉద్యోగం ఉండదు. సంఘం గుర్తింపు రద్దు అవుతుంది.

ఇటువంటి పరిస్థితులలో 1942లో తాలూకా బోర్డు టీచర్స్ సంఘంలో బాధ్యతాయుత స్థానం స్వీకరించారు. ఉపాధ్యాయ సమస్యలు ఒక ప్రాంతానికే పరిమితం కావని సంఘాన్ని జిల్లా వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే ప్రయత్నాలు ప్రారంభించారు. 1944లో గుంటూరు జిల్లా బోర్డు సంఘాన్ని నిర్మించారు. అప్పటికే తూర్పుగోదావరి జిల్లాలో ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ పేరుతో రాష్ట్ర సంఘ స్థావన జరిపినప్పటికి, క్రమశిక్షణ పేరుతో ప్రభుత్వ బెదిరింపులు కారణంగా కార్యక్రమాలు నిలిపివేశారు. చెన్నుపాటి వారితో మాట్లాడి 1947లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1500 మంది ఉపాధ్యాయ కార్యకర్తలతో ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ మొదటి మహాసభ 1947 ఏప్రిల్లో గుంటూరులో జరిపారు. చెన్నుపాటి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

నాటి జిల్లా బోర్డులు, పాలకులకు ఇది కంటగింపు అయింది. కార్య కర్తలచే బలవంతపు రాజీనామాలు చేయించారు. జీతాలు ఇవ్వకుండా బాధలు పెట్టారు. 1951లో సంఘాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ చెన్నుపాటి హైకోర్టులో వేసిన రిట్లై వచ్చిన చారిత్రాత్మక తీర్పు ఉపాధ్యాయ సంఘాలకే కాక, సంఘ స్వాతంత్రం కోరుకునే అందరికీ రక్షణ కల్పించింది. అందుకే ఆయన అందరికి అద్యుడయ్యాడు. ఆయన పట్టుదల, పోరాటం అందరికి ఆదర్శం.

ఉపాధ్యాయులు సమాజంలో భాగంగా ఉండాలని వారి కష్ట సుఖాలతో పాలు పంచుకోవాలని చెన్నుపాటి దిశానిర్దేశం చేసేవారు. యుదియఫ్ ఆ సామాజిక స్పృహతోనే పనిచేస్తున్నది. ప్రజా తంత్ర పనివిధానం నుండే సమిష్టి పని విధానం అలపడుతుంది. అందుకే విభిన్న భావాలను కలవారిని ఒక త్రాటిపై నడిపారు. ఉపా ధ్యాయుల సమస్యలు పూర్తిగా వివడం, సలహాలు ఇవ్వడం, అర్జీలు వ్రాయించడం, ప్రాతి నిధ్యాయలు చేయడం... ఒక సీనియర్ కార్యకర్త లాగా చేసేవారు. ఆదేశాలు జారీ చేయడం ఆయన వద్దతికి విరుద్ధం. ఆయన వని విధానంలో నాయకుడు, కార్యకర్తల మధ్య విభజన రేఖ కన్పించదు. ఉపాధ్యాయ సమస్యలన్నీ ఆయన సమస్యలే. నిరంతరం నూతన కార్యకర్తల కొరకు చెన్నుపాటి అన్వేషించేవారు. తనకు తారనవడిన ఉత్సాహ వంతులైన యువ ఉపాధ్యాయులను ప్రోత్సహించి, తీర్చిదిద్ది స్థిరంగా పనిచేసేలా నిరంతరం కృషి చేసేవారు.

ఉపాధ్యాయ ఉద్యమం కోసం చెన్నుపాటి ఉద్యోగాన్ని కోల్పోయారు. అనారోగ్యం వెంటాడు తున్నా లక్ష్యపెట్టకుండా సంఘ నిర్మాణం కోసం, రేయింబవళ్ళు శ్రమిస్తూ ఆరోగ్యాన్ని క్షీణింవ చేసుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో 1968 డిసెంబర్ 9న తుది శ్వాస విడిచారు.

ఉద్యమాల ద్వారా గతంలో సంపాదించుకున్న సౌకర్యాలన్నీ నేడు ఒక్కది ఒక్కటిగా కోల్పోతున్నాం. పాత పెన్షన్ విధానం రద్దు అయింది. ప్రభుత్వరంగం నుండి విద్య క్రమంగా దూరమవుతున్నది. కార్పొరేటీకరణ ప్రభావం పబ్లిక్ రంగాన్ని కుదిపివేస్తున్నది. ఉపాధ్యాయ ఉద్యమాలు దారి తప్పుతున్నాయి.

చెన్నుపాటి స్ఫూర్తితో ఉపాధ్యాయ ఉద్యమం మరింత పటిష్టం కావడానికి కృషి చేద్దాం. ప్రభుత్వ విద్యాభివృద్ధికి, సామాజికాభివృద్ధికి పాటు వడదాం. వృత్తిపట్ల అంకితభావం కలిగి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు నడుద్దాం. చెన్నుపాటి ఆశయాలకు పునరంకితం అవుదాం. ★

# ప్రశ్నోత్తరాలు



E-Mail Id
ikyopadhyaya1975@gmail.com
నిర్వహణ : టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు
రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్

**ప్రశ్న** : మున్సిపల్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వారికి ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి ఇచ్చే సందర్భం లో డిపార్ట్‌మెంట్ పరీక్షలు తప్పనిసరిగా ఉత్తీర్ణత పొంది ఉండాలని, 50 సం॥ల వయసు నిండినవారికి కూడా మినహాయింపు వర్తించదని అంటున్నారు. వాస్తవమేనా?

– **శ్రీనివాసరావు,** విజయవాడ

**జవాబు** : సరియైనదికాదు. జిఓ నం.320, తేదీ.07.12.2016 ప్రకారం డైరక్ట్ స్కూల్ అసిస్టెంట్ అయితే 45 సం॥లు నిండిన వారికి, ఎస్‌జిటి కేడర్ నుండి పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్ అయితే 50 సం॥లు నిండితే హెచ్‌ఎం పదోన్నతికి శాఖాపరమైన పరీక్షల నుండి మినహాయింపు వర్తిస్తుంది.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు 2017లో 30 సం॥లు సర్వీసు పూర్తి చేసినారు. ఆయన 2022లో 30 సం॥ల ఇంక్రిమెంట్‌కు దరఖాస్తు చేసుకొంటే అభ్యంతరము తెలియజేస్తున్నారు. వారికి ఇంక్రిమెంట్ వస్తుందా?

– **కె.హనుమంతరావు,** బాపట్ల

**జవాబు** : వస్తుంది. డైరక్టర్ ఆఫ్ ట్రజరీస్ Lr.No.Fin02-18069/65/2022-H Sec-DTA, Dt.02.09.2022లో ఇచ్చిన వివరణ ఉత్తర్వులలో 30 సం॥ల ఇంక్రిమెంట్ మంజూరులో ఆర్థిక శాఖ Cir.No.020091/125/PC-II/2011, Dt.17.08.2011లోని నిబంధనలను పాటించాలని తెలియజేసారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 2017లో 30 సం॥లు పూర్తి అయినప్పటికీ అదే కేడర్‌లో కొనసాగుతూ ఉంటే 01.07.2018 నుండి 30 సం॥ల ఇంక్రిమెంట్ మంజూరు చేస్తూ 01.01.2022 తేదీ నుండి ఆర్థిక లాభంతో వర్తిస్తుంది.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు క్యాన్సర్ చికిత్స కొరకు అర్థజీతపు సెలవు పెట్టారు. జీతం పూర్తిగా చెల్లించాలా? లేక అర్థ జీతపు సెలవు జీతం చెల్లించాలా?

– **కె.కృష్ణ,** ఎ.ఎస్.ఆర్.జిల్లా

**జవాబు** : జిఓ నం.188 ఆర్థిక; తేదీ.30.07.1973, జిఓ నం. 386 ఆర్థిక; తేదీ.06.09.1976, జిఓ నం.20 ఆర్థిక, తేదీ.25.01.1977 ఉత్తర్వుల ప్రకారం వీరికి అర్థ జీతపు సెలవు కాలానికి గరిష్టంగా 6 నెలల వరకు పూర్తి వేతనం చెల్లించవచ్చు.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయిని ఆమె జీతంతో పాటు ఫ్యామిలీ పెన్షన్ కూడా పొందుతున్నారు. రెండు ఆదాయాలు ఆదాయపు పన్నులో చూపించాలా?

– **కె.కేశవరావు,** గుంటూరు

**జవాబు** : చూపించాలి. అయితే ఫ్యామిలీ పెన్షన్‌లో 3వ వంతు గరిష్ఠంగా రూ.25000/-ల వరకు పన్ను మినహాయింపు వర్తిస్తుంది.

**ప్రశ్న** : 18 సం॥ల ఇంక్రిమెంట్ పొందాలంటే అదనంగా వుండాల్సిన అర్హతలు ఏంటి?

– **వాసు,** దుగ్గిరాల

**జవాబు** : 12 సం॥ల స్కేలు పొందిన వారికి 18 సం॥ల సర్వీస్ పూర్తి కాగానే 12 సం॥ల స్కేలులోనే ఒక ఇంక్రిమెంట్ ఇస్తారు. ప్రత్యేకంగా అదనపు అర్హతలు అవసరం లేదు.

**ప్రశ్న** : ఇంటర్‌లో రెండవ భాషగా సంస్కృతం ఉన్న ఉపాధ్యాయులు డిపార్ట్‌మెంట్ పరీక్షలు అవసరమైతే ఏఏ పరీక్షలు ఉత్తీర్ణులు కావాలి?

– **భగీరథీ,** పొదిలి

**జవాబు** : ఇఓ, జిఓతో పాటు లాంగ్వేజ్ టెస్ట్ పేపర్ కోడ్ 37 కూడా ఉత్తీర్ణత పొందాలి.

**ప్రశ్న** : జూన్‌లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయుని ఇంక్రిమెంట్ ఆగష్టులో ఉన్నది. అతను ఆగష్టుకి పదోన్నతి పోస్టులో వేతన స్థిరీకరణ చేయమని కోరుకుంటే, 6 సం॥ల ఇంక్రిమెంట్ జూన్ నుండి లెక్కిస్తారా? ఆగష్టు నుండి లెక్కిస్తారా?

– **చక్రవర్తి,** శ్రీకాకుళం

**జవాబు** : ఒక కేడర్‌లో 6 సం॥ల సర్వీసు ఆ ఉద్యోగి ఆ పోస్టులో చేరిన తేదీనుండే లెక్కిస్తారు. కావున జూన్ నుండి లెక్కిస్తారు.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు 54060-140540 స్కేలులో ప్రస్తుతం 140540/- మూలవేతనం పొందుతున్నారు. అతనికి తదుపరి ఇంక్రిమెంట్ ఉంటుందా? ఉంటే 3320గా ఇవ్వాలా? 3610గా ఇవ్వాలా?

– **శ్రీమన్నారాయణ,** కడప

**జవాబు** : స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్ ఇవ్వవలసి ఉంటుంది. ఎలాంగేటెడ్ స్కేలులో 3610 ఇంక్రిమెంట్ రేటు ప్రకారమే తదుపరి ఇంక్రిమెంట్ ఇస్తారు.



# కృష్ణా-గుంటూరు జిల్లా గ్రాడ్యుయేట్ పిడిఎఫ్ అభ్యర్థిగా
# కె.యస్.లక్ష్మణరావు

ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, ప్రజా సంఘాలు కెఎస్ లక్ష్మణరావు గారి అభ్యర్థిత్వాన్ని బలపరిచాయి. తూర్పు-పశ్చిమగోదావరి పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ వి. బాలసుబ్రమణ్యం విజయవాడ లోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో అక్టోబర్ 30న జరిగిన సదస్సులో కృష్ణా-గుంటూరు శాసనమండలి పిడిఎఫ్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్సీ కె.యస్. లక్ష్మణరావు అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు.

ఈ సందర్భంగా ఐ వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ 2007 శాసనమండలి పునరుద్ధరణ నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక ప్రజల హక్కులను కాపాడేందుకు అత్యంత నిజాయతీగా, నిబద్ధతతో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ప్రజల ముందుకు తీసుకొచ్చామని చెప్పారు. చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, వి.బాలసుబ్రమణ్యంతో పాటు వివిధ రంగాల్లో నిష్ణాతులైన 13 మంది పిడిఎఫ్ తరపున ఎమ్మెల్సీలుగా పనిచేశారని వెల్లడించారు. శాసనమండలి వేదికగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, అంగన్వాడీ, విద్యార్థుల తరపున శాసనమండలిలో గళమెత్తడంతో పాటు మండలి వెలుపల వారి ఉద్యమాలకు మద్దతు తెలిపామని పేర్కొన్నారు.

వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాజ్యాంగంలో ఉన్న ప్రమాణాలను శాసనమండలిలో తాము పాటించామని చెప్పారు. ప్రజల పక్షాన, ప్రజల కోసం పనిచేస్తూ ఎలాంటి సొంత లాభం లేకుండా పనిచేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులందరూ తమ ఓట్లను నమోదు చేసుకుని లక్ష్మణరావుకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మేధావుల ఎన్నికలుగా పట్టభద్రుల ఎన్నికలు జరగాలని అన్నారు.

యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె సుబ్బరావమ్మ, ఆవాజ్ కార్యదర్శి శిష్టి, జనవిజ్ఞాన వేదిక నాయకులు కె శ్రీనివాస్, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ నాయకులు వెంకట్రావు, మెడికల్ రిప్రజెంట్ అసోసియేషన్ నాయకులు కృష్ణయ్య, ఎసిఇఎ నాయకులు ప్రభాకర్ వారి సంఘాల తరపున మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. నవంబరు 6వ తేదీలోపు ఓటర్లుగా నమోదు చేసుకుని లక్ష్మణరావుకు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సహాధ్యక్షులు ఎఎన్ కుసుమ కుమారి, కార్యదర్శులు ఎస్.పి.మనోహర్ కుమార్, కె. ఉమామహేశ్వరరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు ఎన్ కుమార్ రాజా, ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, లయోల మాజీ ప్రిన్సిపల్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.





## ఎస్ఎస్‌సి-2024 మోడల్ టెస్ట్ పేపర్లు

యుటిఎఫ్ అకడమిక్ విభాగం అధ్వర్యంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే రూపొందించబడిన 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లు (ఇంగ్లీషు మీడియం) నూతనంగా రూపొందుతూ గత మూడు దశాబ్దాలుగా విజయవంతంగా ప్రచురించబడుతున్నాయి.

విద్యార్థుల, ఉపాధ్యాయుల ఆదరాభిమానాలు విశేషంగా చూరగొంటున్నాయి. అన్ని సబ్జెక్టులకు మూడు ప్రశ్నా పత్రాలు మరియు జవాబులతో పాటు అదనపు సమాచారం పొందపరచబడుతున్నది.

మార్చి 2025 టెస్ట్ పేపర్లు నూతన సిసిఇ పద్ధతిలో తయారు చేయబడ్డాయి. డిసెంబర్ రెండవ వారంలో అందుబాటులో ఉంటాయి. కావలసిన వారు స్థానిక యుటిఎఫ్ కార్యాలయాలు లేదా కార్యకర్తల ద్వారా పొందవచ్చు.

**ఐక్యఉపాధ్యాయ ప్రచురణలు**

చెన్నుపాటి భవన్, పాలపర్తివారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520002

వెల రూ.75/-



# ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థిగా శ్రీమతి కోరెడ్ల విజయగౌరి పోటీ చేస్తున్నారు. విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నవంబర్ 5న జరిగిన సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం ఆమెను అభ్యర్థిగా ప్రకటించారు. వివిధ సంఘాలు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచ్చాయి.

బొబ్బిలి మండలం, రాజుపేటలో 1968 ఆగష్టు 24న జన్మించారు. ప్రాథమిక విద్య, నారశింహునిపేట, బొబ్బిలిలోనూ, ఇంటర్ బొబ్బిలిలో, డిగ్రీ కళింగపట్నంలో చదివారు. 1990 ఆగష్టు 6 నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా, ప్రస్తుతం రామభద్రపురం పూడివీధి ఎంపిపి స్కూల్‌లో హెచ్ఎంగా పనిచేసారు.

తండ్రి సంజీవ్‌నాయుడు ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్డు అయ్యారు. సోదరుడు శేషగిరిరావు ఉపాధ్యాయుడిగా, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేసి విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కోవిడ్ సమయంలో కరోనా బారిన పడి మృతి చెందారు. మరో సోదరుడు తిరుపతిరావు ఇంజినీర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సోదరి రమాప్రభ సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నారు.

విజయగౌరి విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై పోరాటం చేశారు. హైస్కూల్ స్థాయి నుంచి ఎస్ఎఫ్‌లో చేరారు. కాలేజీ స్థాయి ఎస్ఎఫ్ఐలో క్రియాశీల నాయకురాలిగా పనిచేశారు. అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో యుటియఫ్ జిల్లా, రాష్ట్ర నాయకురాలిగా ఎదిగారు. రేషనలైజేషన్ పేరిట పాఠశాలల కుదింపు, క్లస్టర్ పాఠశాలల విధానం వంటివాటిపై ఉద్యమాలు ముందుకు నడిపేందుకు చొరవ చూపారు. జిఓ నెంబర్ 72కి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో పోలీసులు అక్రమ కేసు బనాయించినా వెరవలేదు. 2017లో అక్రమ బదిలీలపై జరిగిన ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ నేతగా నాయకత్వం వహించారు.

1996 నుంచి బొబ్బిలి ప్రాంతంలో యుటిఎఫ్ విస్తరణకు కృషి చేశారు. యుటిఎఫ్ బొబ్బిలి మండల తొలి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆమె, అనంతరం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర సహాధ్యక్షులుగా, ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తూ యుటిఎఫ్ ఉద్యమా ల్లోనూ, వివిధ ఉపాధ్యాయ సంఘాలను ఐక్యం చేయడంలోనూ కీలకపాత్ర పాత్ర పోషించారు. ప్రస్తుతం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు.

ఉపాధ్యాయ వృతిలో చేరాక భారత జ్ఞాన విజ్ఞాన సమితి వేదికలో 1992 నుంచి 1995 వరకు వందలాది గ్రామాల్లో అక్షరాస్యతా శాతం పెంపునకు కృషి చేశారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగాను, అక్షరాస్యత ఆవశ్యకత గురించి కొన్ని గ్రామాల్లో మూడు నెలలపాటు 20మంది యువతులతో ప్రచారోద్యమం చేపట్టారు. మరోవైపు సమతా కళాజాత నిర్వహణ కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తూ 1994 నుంచి 1996 వరకు సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఏర్పాటు, సైన్స్ ఉద్య మాన్ని బొబ్బిలి ప్రాంతంలో కీలకంగా నడిపారు. ఈ క్రమంలో 72 గిరిజన గ్రామాల్లో పర్యటించి, గిరిజన స్థితిగతులు, ఆ ప్రాంతంలోని విద్యారంగ సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ఎనలేని కృషిచేశారు. ఆ ఉద్యమ ఫలితంగా జిల్లాలో మూతపడిన 12 ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరవడంతోపాటు కొత్తగా మూడు పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

నిరంతరం ఉపాధ్యాయ ఉద్యమంలోనూ, ప్రజా ఉద్యమాలలోనూ పనిచేస్తున్న **కోరెడ్ల విజయగౌరి**కి ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని యుటియఫ్ విజ్ఞప్తి చేస్తున్నది.




* **Income Tax Slab Rates**
* **For FY 2024-25 and**
* **AY 2025-2026**

*(New & Old Regime Tax Rate)*

# ఉద్యోగులు ఆదాయపు పన్ను

TSLN మల్లేశ్వరరావు
రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్

ఆదాయపు పన్ను చట్టం-1961 సెక్షన్ 192 ప్రకారం ప్రతి ఉద్యోగి తన వేతన ఆదాయం, ఇతర ఆదాయాలు కలిపి మొత్తం ఆదాయంపై ప్రతి సంవత్సరం నిబంధనల మేరకు పన్ను చెల్లించాలి. 2024-25 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి (01.04.2024 నుండి 31.03.2025 వరకు గల ఆదాయము) ఉద్యోగులు చెల్లింపు చేయవలసిన ఆదాయపు పన్ను లెక్కింపులోని ముఖ్యాం శాలను పరిశీలిద్దాము.

1) 75 సంIIలు వయస్సు మించిన సీనియర్ సిటిజన్లు పెన్షన్ మరియు బ్యాంక్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఒకే బ్యాంకు నుండి మాత్రమే పొందుతున్న వారు ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలు చేయనవసరం లేదు.
2) ప్రీమియం 2.5 లక్షలు దాటితే యూనిట్ లింక్ ఇన్స్యూరెన్స్ పాలసీలపై వచ్చే ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది.
3) ఈ ఆర్థిక సంవత్సరంలో పిఎఫ్ చందాలు 2.5 లక్షలు దాటితే వచ్చే వడ్డీపై పన్ను చెల్లించవలసి ఉంటుంది.

**వేతనాదాయంగా పరిగణించే అంశాలు :**

(1) మూలవేతనము, డిఏ, హెచ్ఆర్ఏ, సిసిఏ, ప్రోత్సాహక ఇంక్రిమెంట్లు, ఐ.ఆర్.(2) వేతన బకాయిలు, వేతన అడ్వాన్స్ (3) పెన్షన్ (4) సరెండర్ లీవు (5) బోనస్ (6) నూతన పెన్షన్ పథకంలో ప్రభుత్వ వాటా (7) మెడికల్ రీయింబర్స్‌మెంట్

**వేతనాదాయంగా పరిగణించబడని అంశములు :**

(1) గ్రాట్యుటీ (2) కమ్యూటెడ్ (3) యల్‌టిసి (4) పిఎఫ్ నుండి చెల్లింపులు (5) టూర్ / ట్రాన్స్‌ఫర్, టిఏ, డిఏ (6) రిటైరైన తదుపరి సంపాదిత, అర్ధజీతపు సెలవు నగదు (7) కన్వేయన్స్ అలవెన్స్ (8) ఎడ్యుకేషన్ అలవెన్స్

**ఇతర ఆదాయ అంశాలు :**

(1) నివాస గృహాలు, వ్యాపార కాంప్లెక్స్‌లపై వచ్చే అద్దెలు, వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయం, షేర్లు / మ్యూచువల్ ఫండ్స్ అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయం.
(2) బ్యాంక్‌లు, పోస్టు ఆఫీసు లలోని సేవింగ్స్ ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీలు
(3) ఉద్యోగి లేదా సర్వీస్ పెన్షనర్ పొందుతున్న ఫ్యామిలీ పెన్షన్
(4) గత సంవత్సరం ఆదాయపు పన్ను రీఫండ్ ద్వారా వచ్చిన వడ్డీ

ఈ ఆర్థిక సంవత్సరంలో పన్ను లెక్కింపు విధానము రెండు విధాలుగా వర్గీకరించారు.

1. మినహాయింపులు గాని, తగ్గింపులు గాని ఏవి వర్తించవు. పన్ను లెక్కింపు స్లాబు రేటు మార్పు చేయబడింది.
2. మినహాయింపులు, తగ్గింపులు గతంలో మాదిరిగానే వర్తిస్తూ గత సంవత్సరం విధంగానే ఆదాయపు పన్ను రేట్లు కొనసాగింపు.

పై రెండింటిలో ఉద్యోగి తనకిష్టమైన దానిని ఎన్నుకోవచ్చు.

**ముఖ్యాంశములు**

1. New Tax Regimeలో 7 లక్షలలోపు ఆదాయం గల వారికి స్టాండర్డ్ డిడక్షన్ 75 వేలు మినహాయింపు వర్తిస్తుంది
2. New Tax Regimeలో 3 లక్షల వరకు పన్ను ఉండదు.
3. New Tax Regimeలో స్టాండర్డ్ డిడక్షన్ మినహాయించిన తర్వాత ` 7,00,10ల నుండి `7,22,220ల వరకు ఆదాయం గల వారికి గరిష్టంగా ` 20,000ల నుండి కనీసం ` 10లు వరకు Marginal Reliefగా పన్ను మినహాయింపు వర్తిస్తుంది

**మొదటి విధానం (సెక్షన్ 115 బిఎసి)**

**(New Tax Regime)**

ఈ విధానంలో స్టాండర్డ్ డిడక్షన్, 7లక్షలలోపు ఆదాయానికి 87A సెక్షన్ కింద రిబేటు, 7లక్షల పైన ఆదాయానికి మార్జినల్ రిలీఫ్, అద్దెకిచ్చిన ఇంటిపై తీసుకున్న గృహ ఋణంపై చెల్లించిన వడ్డీ, నూతన పెన్షన్ స్కీమ్‌కు ప్రభుత్వం చెల్లించిన వాటా, గ్రాట్యూటీ, లీవ్ ఎన్ క్యాష్ మెంట్, తదితర మినహాయింపులు వర్తిస్తాయి. ఈ విధానంలో పనులెక్కింపు అన్ని వయసుల వారికి ఒకే విధంగా ఉంటుంది.

**పన్ను లెక్కింపు పట్టిక**

| ఆదాయం 3 లక్షల వరకు | పన్నులేదు |
|---|---|
| 3 లక్షల నుండి 7 లక్షల వరకు | 5% |
| 7 లక్షల నుండి 10లక్షల వరకు | 20000+7 లక్షలు దాటిన ఆదాయంపై 10% |
| 10 లక్షల నుండి 12 లక్షల వరకు | 50000+10 లక్షలు దాటిన ఆదాయంపై 15% |
| 12 లక్షల నుండి 15 లక్షల వరకు | 80,000+12లక్షలు దాటిన ఆదాయంపై 20% |
| 15 లక్షలపైన | 1,40,000+15లక్షలు దాటిన ఆదాయంపై 30% |

**మార్జినల్ రిలీఫ్ :** నూతన పన్ను విధానంలో పన్ను విధించదగిన ఆదాయం 3 లక్షల వరకు పన్నులేదు. 7 లక్షల వరకు సెక్షన్ 87ఏ ప్రకారం రిబేట్ వస్తుంది. అంటే 7 లక్షల వరకు పన్ను వుండదు. 7 లక్షలు దాటి కొద్దిమొత్తం ఉన్నప్పటికి అధికంగా పన్ను చెల్లించాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని 7,00,010 రూపాయల నుండి 7,22,220 వరకు ఆదాయం కలవారికి కొంత రిలీఫ్ ఇవ్వడం జరిగింది. ఉదాహరణతో పరిశీలిద్దాం.

ఒక వ్యక్తి పన్ను విధించదగిన ఆదాయం 7,05,000లు అనుకుందాం. నూతన పన్ను విధానంలో చెల్లించాల్సిన పన్ను 20,500.

**మార్జినల్ రిలీఫ్ వర్తిస్తే**

| | | |
|---|---|---|
| 7,05,000 వరకు పన్ను | : | 20,500 |
| 7 లక్షల కన్న అధికంగా ఆదాయం | : | 5,000 |
| తేడా | : | 15,500 |

ఈ 15,500 మార్జినల్ రిలీఫ్‌గా వస్తుంది. అంటే చెల్లించాల్సిన పన్ను 20,500-15,500=రూ.5000లు అవుతుంది.

## రెండవ విధానం

ఈ విధానంలో తగ్గింపులు / మినహాయింపులు గత సంవత్సరం మాదిరిగానే ఉన్నాయి. వాటిని పరిశీలిద్దాం.

### మినహాయింపు / తగ్గింపు లభించే అంశాలు

**1. హెచ్ఆర్ఏ సెక్షన్ 10 (13ఏ):**

(ఏ) వాస్తవంగా పొందిన హెచ్ఆర్ఏ

(బి) వేతనంలో 10%కంటే అదనంగా చెల్లించిన ఇంటి అద్దె అనగా చెల్లించిన అద్దె (మూలవేతనం+డిఏ) × 10%.

(సి) వేతనంలో 40% (మెట్రో నగరాలైతే 50%)

ఈ మూడింటిలో తక్కువైన మొత్తం, ఆదాయం నుండి తగ్గించబడుతుంది.

**గమనిక :**

(1) స్వంత ఇంటిలో నివసిస్తుంటే హెచ్ఆర్ఏ మినహాయింపు వర్తించదు. హెచ్ఆర్ఏ నెలకు రూ.3000/-లపైన ఉంటే రశీదు జతపరచాలి.

(2) వాస్తవంగా చెల్లించిన ఇంటి అద్దె సంవత్సరానికి లక్ష రూపాయలకు మించితే ఫారం 12 బిబి సమర్పించాలి.

**2. స్టాండర్డ్ డిడక్షన్ :** సెక్షన్ 16 (1ఏ) మరియు 17 (2)(8) క్లాజు 5 ప్రకారము ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్‌గా రూ.50,000/-లు మినహాయింపు వర్తిస్తుంది. ఇది ఉద్యోగులందరితోపాటు పెన్షనర్లకు కూడా వర్తిస్తుంది.

**3. వృత్తి పన్ను :** సెక్షన్ 16 (iii) ప్రకారం ఉద్యోగి ఆ సంవత్సరంలో చెల్లించిన మొత్తం వృత్తిపన్ను ఆదాయం నుండి తగ్గించబడు తుంది.

**4. గృహ నిర్మాణ అప్పు (సెక్షన్ 24) :** స్వంత ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న అప్పుపై చెల్లించే వడ్డీ పరిమితిని గరిష్ఠంగా 2013-14 సంవత్సరం వరకూ లోను తీసుకున్న వారికి రూ. 1,50,000/-ల వరకు మరియు 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి లోను తీసుకున్న వారికి రూ.2,00,000/-ల వరకూ మినహాయింపు ఇస్తారు.

**(బి) సెక్షన్ 80 ఇఇ :** 01.04.2016 నుంచి 31.03.2017 వరకూ 35 లక్షలలోపు ఇంటి లోన్ మొదటిసారి తీసుకున్న వారికి రూ. 50,000/-ల వరకు వడ్డీని అదనంగా మినహాయింపు ఇస్తారు.

**(సి) సెక్షన్ 80 ఇఇఏ :** ఈ ఆర్థిక సంవత్సరంలో అనగా 01.04.2019 నుంచి 31.03.2022 వరకూ ఇంటి లోను మొదటిసారి తీసుకున్నవారికి ఇంటి విలువ రూ. 45,00,000/-ల లోపు ఉన్నట్లయితే రూ.1,50,000/-లు వరకూ వడ్డీని సెక్షన్ 80ఇఇఏ ప్రకారంగా అదనంగా మినహాయింపు ఇస్తారు.

ఇల్లు అద్దెకు ఇచ్చినచో, వాస్తవంగా పొందే అద్దె ఆదాయం నుంచి నీటి పన్ను, ఇంటి పన్నుల వంటి మున్సిపల్ టాక్సులు మరియు అద్దె ద్వారా వచ్చిన ఆదాయంలో 30% వరకూ మరమ్మత్తులు మెయింటెనెన్స్ ఖర్చులను తీసివేసి ఆదాయంగా పరిగణించాలి.

**(డి) సెక్షన్ 80 ఇఇబి మినహాయింపు :** ఈ ఆర్థిక సంవత్సరంలో 01.04.2019 నుంచి 31.03.2023 వరకూ ఏదైనా ఎలక్ట్రిక్ వాహనాన్ని లోనుపై కొనుగోలు చేసినట్లయితే వడ్డీ రూ. 1,50,000/-ల వరకూ మినహయిస్తారు.

**పెన్షనర్లకు ఇంటి అద్దె మినహాయింపు (సెక్షన్ 80జిజి) :** హెచ్ఆర్ఏ లేని వారికి, పెన్షనర్లకు ఈ సెక్షన్ క్రింద మినహాయింపు వర్తిస్తుంది. సదరు వ్యక్తికి గాని, స్పౌజ్‌కి గాని, మైనర్ పిల్లల పేరిట గాని స్వంత ఇల్లు ఉండరాదు. ఫారం 10బిఏలో డిక్లరేషన్ ఇవ్వాలి. వీరికి (1) ఆదాయంలో 10%కన్న అధికంగా చెల్లించిన ఇంటి అద్దె (2) మొత్తం ఆదాయంలో 25% (3) నెలకు రూ.5000/-లలో ఏది తక్కువైతే అది మినహాయింపు పొందవచ్చు.

**5. సెక్షన్ 80సి క్రింద తగ్గింపులు :** (1) ఎల్ఐసి ప్రీమియం (పాలసీ మొత్తంలో 10% గరిష్ఠ పరిమితి మరియు అంగవికలురు, దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులైతే 15% గరిష్ఠ పరిమితితో) (2) పిఎఫ్ చందా (3) నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ (8వ ఇష్యూ) (4) యుటిఐ యూనిట్ లింక్‌డ్ ఇన్సూరెన్స్ ప్లాన్ (5) ఎల్ఐసి ధనరక్ష మ్యూచువల్ ఫండ్ (6) సెక్షన్ 10 (23డి) ననుసరించి అనుమతించబడిన మ్యూచువల్ ఫండ్ (7) గృహ నిర్మాణము లేక కొనుగోలుకై ప్రభుత్వం / బ్యాంక్‌లు / ఎల్ఐసి / నేషనల్ హౌసింగ్ బ్యాంక్ నుంచి పొందిన అప్పులు తీర్చుటకు తిరిగి చెల్లించిన అసలు (8) ఇద్దరు పిల్లలకు చెల్లించిన ట్యూషన్ ఫీజు (9) ఈక్విటి లింక్‌డ్ సేవింగ్స్ స్కీమ్‌లలో పెట్టుబడి (10) అనుమతించబడిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్స్ (11) పెన్షన్ ఫండ్ (12) పోస్టాఫీజులోగానీ లేదా ఏదైనా షెడ్యూల్ బ్యాంకులో కనీసం 5 సం॥ల ఫిక్స్‌డ్ చేసిన టర్మ్ డిపాజిట్లు (13) సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ 2004.

**6. సెక్షన్ 80సిసిసి :** ఎల్ఐసి / కేంద్ర ప్రభుత్వం గుర్తించిన పెన్షన్ స్కీమ్‌కు చెల్లించిన కాంట్రిబ్యూషన్.

**7. సెక్షన్ 80సిసిడి (1) :** నూతన పెన్షన్ స్కీమ్‌కి (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) వేతనంలో చెల్లించిన 10% కాంట్రిబ్యూషన్.

**గమనిక :** పైన తెలిపిన 5,6,7లకు చెందిన 80సి, 80 సిసిసి, 80 సిసిడి(1) సెక్షన్‌ల క్రింద కలిపి మొత్తం 1.5 లక్షల గరిష్ఠ పరిమితి వరకు మాత్రమే మినహాయింపు వర్తిస్తుంది.

(తరువాయి 22వ పేజీ)

# 50 ఏళ్ళ యుటియఫ్ ఉద్యమ ప్రస్థానంలో...


కా॥ ఎ.ఎన్.కుసుమకుమారి


కా॥ వి.మహేశ్వరరావు


కా॥ టి.రఘుపతిరెడ్డి


కా॥ సిహెచ్.రవీంద్ర


కా॥ బి.గోపీమూర్తి


కా॥ కె.నాగమల్లేశ్వరరావు


కా॥ ఎస్.పి.మనోహర్‌కుమార్


కా॥ డి.వి.రాఘవులు


కా॥ ఎస్.మురళీమోహనరావు


కా॥ ఎన్.అరుణకుమారి


కా॥ ఎస్.ఎస్.నాయుడు


కా॥ ఎన్.నవకోటేశ్వరరావు


కా॥ వి.కోటేశ్వరప్ప


కా॥ రెడ్డి మోహనరావు


కా॥ టి.అన్నారాము


కా॥ బి.సుభాషిణి


కా॥ జి.వి.రమణ


కా॥ ఎస్.కిషోర్‌కుమార్


కా॥ ఎస్.జ్యోతిబసు


కా॥ వి.శ్రీలక్ష్మి


కా॥ ఎన్.కుమార్ రాజా


కా॥ టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు


కా॥ ఎం.హనుమంతరావు

50 వసంతాల యుటియఫ్...

పి.ఆర్.కాలేజీ ప్రాంగణం, కాకినాడ

17వ

## రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు

వేలాదిగా తరలిరండి - జయప్రదం చేయండి

2025 జనవరి 5,6,7,8 తేదీలు

**8. 80సిసిడి(1బి):** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌కి చెల్లించిన మొత్తం గరిష్టంగా మరొక రూ. 50,000/-లను అదనంగా మినహాయింపు పొందవచ్చు. ఇది సేవింగ్స్ రూ. 1,50,000/-లకు అదనం. కాంట్రిబ్యూటరీ పెన్షన్‌కు చెల్లించిన మొత్తం 80 సిసిడి (1) & (1బి)లలో విభజించి చూపుకోవచ్చు.

**9. విరాళములు (సెక్షన్ 80జి) :** ముఖ్యమంత్రి / ప్రధానమంత్రి సహాయనిధికి చెల్లించే మొత్తం 100%, అనుమతించిన మత / స్వచ్ఛంద సంస్థలకు / రాజకీయ పార్టీలకు ఇచ్చిన విరాళాలలో 50% వరకు ఆదాయం నుండి మినహాయింపు లభిస్తుంది. కానీ సెక్షన్ 80 డిడిబి మరియు 80జి క్రింద మినహాయింపు చేసే అధికారం డిడిఓలకు లేదు. ముందుగా పన్ను చెల్లింపు చేసి ఈ-ఫైలింగ్ చేసే సందర్భంలో రీఫండ్ కోరాలి.

**10. వైద్య ఖర్చులు (సెక్షన్ 80డిడిబి) :** ఉద్యోగి గాని, తనపై ఆధార పడ్డ వారికి దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స నిమిత్తం చేసిన వాస్తవ ఖర్చులో రూ. 40,000/-ల వరకు (60 సం॥ల దాటిన వారికి 1,00,000/-) మినహాయింపుకలదు. ఈ మినహాయింపు కొరకు 10 (i) ఫారంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పిజి, డిగ్రీ కలిగిన స్పెషలిస్టు డాక్టర్ ధృవపత్రము జతచేయాలి.

**11. మెడికల్ ఇన్స్యూరెన్స్ ప్రీమియం (సెక్షన్ 80డి) :** ఉద్యోగి, భార్య / భర్త, పిల్లలలో ఒక్కరు కూడా సీనియర్ సిటిజన్ లేకపోతే వారికై చెల్లించిన ప్రీమియం రూ. 25,000/-, కనీసం ఒక్కరైన సీనియర్ సిటిజన్ ఉంటే రూ. 50,000/-ల వరకు మినహాయింపు పొందవచ్చు. దీనికి అదనంగా తల్లిదండ్రులకై చెల్లించిన ప్రీమియం వారిలో ఒక్కరు కూడా సీనియర్ సిటిజన్ కాకపోతే రూ. 25,000/-ల వరకు, కనీసం ఒక్కరైన సీనియర్ సిటిజన్ అయితే రూ. 50,000/-ల వరకు మినహాయింపు వర్తిస్తుంది.

**గమనిక :**

ఎ) ఇన్స్యూరెన్స్ ప్రీమియంలో ప్రివెంటివ్ హెల్త్ చెకప్ కింద రూ. 5000/-ల వరకు నగదుగా చెల్లించవచ్చు. మిగిలిన మొత్తం నగదు రహిత పద్దతిలో చెల్లించాలి.

బి) సీనియర్ సిటిజన్ ఉండి ఇన్స్యూరెన్స్ ప్రీమియం చెల్లించక పోయినా వైద్య ఖర్చులుగా రూ. 50,000/-ల వరకు మినహాయింపు పొందవచ్చు.

సి) సింగిల్ ప్రీమియంగా చెల్లించినపుడు ఎన్ని సంవత్సరాలకు చెల్లించారో అన్ని సంవత్సరాలకు దామాషాగా మినహాయింపు పొందవచ్చు.

డి) ఇహెచ్ఎస్ క్రింద మినహాయింపబడుతున్న రూ. 225/- మరియు 300/-లు ఈ సెక్షన్ క్రింద మినహాయించు కోవచ్చు.

**12. వికలాంగ ఉద్యోగికి ప్రత్యేక తగ్గింపు (సెక్షన్ 80 యు) :** వైద్యాధికారి యిచ్చిన ధృవ పత్రమును బట్టి 40% వైకల్యం గల వారికి రూ. 70,000/-లు, 80% కన్న ఎక్కువ వైకల్యము కలవారికి రూ. 1,25,000/-లు వరకు మినహాయింపు వర్తిస్తుంది.

**13. వికలాంగులైన ఆధారితుల ఖర్చు (సెక్షన్ 80 డిడి) :** మానసిక / శారీరక / వైకల్యము గల ఆధారితుల వైద్యం, నిర్వహణ పోషణకై చేసిన ఖర్చులను రూ. 75,000/-ల వరకు మినహాయింపు లభిస్తుంది. తీవ్ర వైకల్యమైతే 1,25,000/-ల వరకు మినహాయింపు వర్తిస్తుంది.

**14. విద్యా ఋణం (సెక్షన్ 80ఇ) :** ఉద్యోగి, భార్య / భర్త, పిల్లల ఉన్నత చదువులకై తీసుకున్న అప్పుపై చెల్లించిన వడ్డీని ఆదాయంలో నుండి 8 సం॥ల వరకు లేదా అప్పు తీరే వరకు ఏది ముందైతే అప్పటివరకు మినహాయింపు వర్తిస్తుంది.

**15. సేవింగ్స్ ఖాతాలో నిల్వపైన వచ్చిన వడ్డీ మినహాయింపు (సెక్షన్ 80 టిటిఏ) :** పొదుపు ఖాతాలో నిల్వ ఉన్న సొమ్ముపై వచ్చిన వడ్డీ రూ. 10,000/-ల వరకు మినహాయింపు ఉంటుంది.

**16. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఆర్‌డిలపై వచ్చిన వడ్డీ మినహాయింపు (సెక్షన్ 80 టిటిబి) :** సీనియర్ సిటిజన్‌ల ఎఫ్‌డి మరియు ఆర్‌డిలపై వచ్చిన వడ్డీ గరిష్టంగా రూ. 50,000/-ల వరకు మినహాయింపు కలదు.

## రెండవ విధానంలో పన్ను రేట్లు

పైన తెలిపిన మినహాయింపులు / తగ్గింపు అంశాలలో 1 నుండి 16 అంశముల వరకు మినహాయింపులన్నిటిని మొత్తం ఆదాయం నుండి తీసివేసిన తర్వాత మిగిలిన మొత్తం (పన్ను విధించదగిన ఆదాయం)నకు కింద తెలిపిన విధంగా పన్ను లెక్కించాలి.

| పన్ను విధించదగిన ఆదాయం | పన్ను |
|---|---|
| 2.5 లక్షల వరకు | లేదు |
| 2.5 లక్షల నుండి 5 లక్షల వరకు | 5% |
| 5 లక్షల నుండి 10 లక్షల వరకు | 12,500+5లక్షలు దాటిన ఆదాయంపై 20% |
| 10 లక్షలపైన | 1,25,000+10 లక్షలు దాటిన ఆదాయంపై 30% |

**గమనిక :** ఈ విధానంలో 60 సం॥ల వయస్సులోపు వారికి 2.5 లక్షల వరకు 60 సం॥లు పైబడిన వారికి 3 లక్షల వరకు, 80 సం॥లపై బడిన వారిని 5 లక్షల వరకు పన్ను లేదు.

**పన్ను రిబేటు (సెక్షన్ 87ఏ) :** పన్ను విధించదగిన ఆదాయం 5 లక్షలలోపు ఉన్నట్లు యితే పై పట్టిక ప్రకారం లెక్కించిన పన్నులో గరిష్టంగా రూ. 12,500/- వరకు రిబేటు ఇస్తారు.

**విద్యా సెస్సు :** రిబేటు పోను మిగిలిన పన్నుపై 4% వైద్య మరియు విద్యా సెస్సు విధించబడుతుంది.

**VII ఫారం 10ఇ (సెక్షన్ 89) :** గత సంవత్సరాలకు సంబంధించిన అరియర్స్ (డిఏ మరియు పిఆర్‌సి వంటివి) ఈ ఆర్థిక సంవత్సరంలో డ్రా చేసి యున్నచో ఆ సంవత్సరాలకు సంబంధించిన మొత్తమును ఆయా సంవత్సరాలలో చూపిస్తూ ఫారం 10ఇ సమర్పించి పన్ను మినహాయింపు పొందవచ్చు.

**పన్ను చెల్లించవలసిన విధానం :** డ్రాయింగ్ అధికారులు రాబోవు సంవత్సర కాలానికి ముందుగానే చెల్లించవలసిన పన్నును అంచనా వేసి, ప్రతినెలా జీతపు బిల్లులో మినహాయించాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆ క్వార్టర్‌కు చెల్లించిన పన్ను వివరాలను ఆన్‌లైన్‌లో ఫారం 24Q సమర్పించాలి. మార్చి, ఏప్రిల్, మే మాసముల జీతాల బిల్లులో మినహాయించిన పన్నును జులై 31లోపు, జూన్, జులై, ఆగష్టు మాసముల జీతాల బిల్లులో మినహాయించిన పన్నును అక్టోబర్ 31లోపు, సెప్టెంబరు, అక్టోబర్, నవంబర్ నెలల జీతాల బిల్లులో మినహాయించిన పన్నును జనవరి 31లోపు డిసెంబర్,జనవరి, ఫిబ్రవరి మాసం జీతపు బిల్లులో మినహాయించిన పన్నును మే 15లోపు 24Q ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఇది పూర్తిగా డ్రాయింగ్ అధికారుల బాధ్యత.

# ఉద్యమ వార్తలు

## శ్రీకాకుళం

ప్రభుత్వ విద్యారంగానికి 30 శాతం నిధులు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల్సి ఉన్నా, పది శాతం కూడా కేటాయించడం లేదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు విమర్శించారు. నిధుల్లేమి వల్ల సంస్కరణల పేరిట ప్రపంచ బ్యాంకు నిధులతో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడానికి చేస్తున్న ప్రయత్నం ప్రభుత్వ విద్య ప్రైవేటీకరణకు దారితీస్తోందన్నారు. ప్రభుత్వ విద్య గొంతు నులిమే సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలు మందస మండలం హరిపురంలో నవంబర్ 24న జరిగాయి. తొలుత జాతీయ పతాకాన్ని బొడ్డేపల్లి మోహనరావు, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని బమ్మిడి కృష్ణారావు, యుటిఎఫ్ పతాకాన్ని ఎన్.తవుడు ఆవిష్కరించారు. అనంతరం భారీ ప్రదర్శన చేపట్టారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలహీనపరిచే విధానాలను ఉపాధ్యాయులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులదేనన్నారు. ఉపాధ్యాయుల




సమస్యలపై యుటిఎఫ్ అలుపెరుగని పోరాటంసాగిస్తోందని వివరించారు.

ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి యుటిఎఫ్ కృషి చేస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య అన్నారు. విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలకే పరిమితం కాకుండా, సామాజిక అంశాలపై బాధ్యతతోనూ యుటిఎఫ్ పనిచేస్తోందన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తున్నారని గుర్తు చేశారు.

టెక్కలి డిప్యూటీ డిఇఒ పి.విలియమ్స్, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.కిశోర్ కుమార్, చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, నాయకులు కొంచాడ జగన్న, మట్ట ఖగేశ్వరరావు, గుంట కోదండరావు, గున్న రమేష్, ఎల్.వి చలం, జి.కుమారస్వామి, బల్ల చిట్టిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మన్యం

ప్రభుత్వ విద్యారంగం బలంగా ఉన్నప్పుడే పేదలకు మేలు జరుగుతుందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు ఉపాధ్యాయులు డిఇఒ కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు మహా ర్యాలీ నిర్వహించారు. తప్పెటగుళ్ళు, కోలాటం, థింసా నృత్యాలతో ర్యాలీ సాగింది. అనంతరం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్ అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ పోరాటాలే సమస్యలకు పరిష్కారమని నమ్మిన సంఘం యుటిఎఫ్ అని అన్నారు. విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేయాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 117తో విద్యారంగం నాశనమైందని చెప్పారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల, ఉపాధ్యాయుల జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగంలో కాంట్రాక్టీకరణ పెరుగుతోందని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, లెక్చరర్లను ఇదరేషన్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వారికి కనీస వేతనం చెల్లించాలని కోరారు.

సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్.మురళీమోహన్ రావు, ఎస్.కిశోర్, ఆర్.మోహనరావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.భాస్కరరావు, సహాధ్యక్షులు బి.విజయ కుమార్, వి.జ్యోతి, డిప్యూటీ డిఇఒలు రాజ్ కుమార్, పిసిహెచ్.మోహనరావు, ఎంఇఒలు హాజరయ్యారు. జెఎసి చైర్మన్ జివిఆర్ కిశోర్, హెచ్ ఎంల సంఘం నాయకులు పిసి హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విజయనగరం

ప్రభుత్వ విద్యా రంగంతోనే పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల జెఎసి రాష్ట్ర చైర్మన్ ఎ.వి.నాగేశ్వరరావు స్పష్టంచేశారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా రంగ ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యా రంగాన్ని రక్షించుకోవడం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని, అందుకు యుటిఎఫ్ అగ్రభాగంలో నిలవాలని పిలుపునిచ్చారు. నవంబర్ 24న నగరంలోని శేషగిరి విజ్ఞాన భవనంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ వద్దనున్న జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి కెఎలప్పురంలోని శేషగిరి విజ్ఞాన కేంద్రం (ఎస్వికె) వరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రదర్శన నిర్వహించారు. ఎస్వికె వద్ద ఎస్‌టిఎఫ్ఐ జెండాను సీనియర్ నాయకులు

సత్య(శీనివాస్, యుటిఎఫ్ జెండాను సీనియర్ నాయకులు డి.రాము ఆవిష్కరించారు. ఇటీవల కాలంలో మరణించిన యుటిఎఫ్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్ చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన మహాసభలో నాగేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపైనే కాకుండా సామాజిక స్పృహతో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు సమస్యలపై అండగా ఉన్న ఏకైక సంఘం యుటిఎఫ్ అన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ కరోనా సమయంలోనూ ప్రజలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం సదస్సులు పెట్టి తన ప్రాణాలు కోల్పోయిన సరే అభ్యుదయ వాదాన్ని కడవరకు కొనసాగించిన కె. శేషగిరి అందరికీ స్ఫూర్తి అన్నారు. ప్రభుత్వం సృష్టించే సమస్యలను ఐక్యంగా పోరాడి పరిష్కరించుకోవాలన్నారు.

అనంతరం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.విఆర్కె ఈశ్వరరావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఏసి రాష్ట్ర కార్యదర్శి బి.కాంతారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్, డివైఎఫ్ ఐ జిల్లా కన్వీనర్ బి. హరీష్, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, సహాధ్యక్షులు పార్వతి, కోశాధికారి చింతా భాస్కరరావు, కె శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవ ఎన్ను కున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె. శ్రీనివాసరావు, జె.విఆర్కె ఈశ్వర రావు, గౌరవ అధ్యక్షులుగా మీసాల అప్పల నాయుడు ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా వి.ప్రసన్నకుమార్, జి.పార్వతి, కోశాధికారిగా సిహెచ్ భాస్కరరావు, కార్యవర్గ సభ్యులుగా కె.ప్రసాదరావు, పి.వాసు, పి.త్రినాథరావు, ఎం. కేశవ, ఆర్.వి. సూర్యారావు, పి.వాసుదేవరావు, జి.వి.రమణ, జి. రాజారావు, సిహెచ్ తిరుపతినాయుడు, కె.శ్రీదేవి, వి.రాధా భవాని, ఎన్.సత్యనారాయణ, ఎం.రఘునాథరాజు, అల్లు శంకరరావు ఎన్నికయ్యారు.

### అనకాపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థను ప్రయోగశాలగా మార్చడం ఎంత మాత్రం తగదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి అన్నారు. నవంబర్ 24న స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి అధ్యక్షతన యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా చిన్నబ్బాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయోగశాలగా మారుస్తుందని అన్నారు.

జి.ఒ.3 రద్దుతో మైదానం నుంచి ఏజెన్సీకి బదిలీ చేయడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి అన్నా రాము మాట్లాడుతూ పిఆర్సి, ఐఆర్, డిఎలపై పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సిఐటియు అండగా నిలుస్తుందన్నారు. యుటిఎఫ్ లో కీలక పాత్ర పోషించిన పలువురిని అభినందిస్తూ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

### తూర్పుగోదావరి

ఉపాధ్యాయులు నిరంతర అధ్యయ నంతో పాటూ సామాజిక స్పృహ, పోరాట పటిమ అవసరమని పిడిఎఫ్ ఎంఎల్సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా యుటిఎఫ్ నూతన కౌన్సిల్, స్వర్ణోత్సవ సభ నవంబర్ 24న నిడదవోలు కొత్తపల్లి శ్రీరాములు కనకమ్మ లయన్స్ క్లబ్ ఆడిటోరి యంలో జరిగింది. షేక్ సాబ్జీ ప్రాంగణం, బ్రహ్మాజీ రావు వేదికపై జిల్లా అధ్యక్షులు పి.జయకర్ అధ్యక్షతన జరిగింది.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లా డారు. సమ సమాజాన్ని నిర్మించే పౌరుల్ని తయారు చేయాలంటే ఉపాధ్యాయులు అభ్యుదయంగా ఆలోచిస్తూ సాంకేతిక దృక్పథంతో బోధించాలన్నారు. 50 ఏళ్ల యుటిఎఫ్ ఉద్యమ చరిత్రలో ఎన్నో విజయాలు ఉన్నాయన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆర్థిక స్థితి మెరుగు పడటం వెనుక యుటిఎఫ్ కృషి, ఉద్యమకారుల త్యాగాలు ఉన్నాయ న్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. అరుణకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉపాధ్యా యులకు రావాల్సిన బకాయిలను సాధించడానికి భవిష్యత్తులో జరిగే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ప్రధాన కార్యదర్శి షరీఫ్ కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. యాప్‌ల భారం బోధన సమ యాన్ని హరిచేస్తుందన్నారు. పాఠశాలల్లో బోధనేతర పనులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎంపీ మీడియం బాబూరావు నూతన ఆర్థిక విధా నాల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. కుల వివక్షత నిర్మూలన సమితి అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ సమాజంలో అంతరాలు లేని సమా జాన్ని తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

యుటియఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు అందించారు. సమావేశానికి ముందు జాతీయ పతాకాని సీనియర్ నాయకులు కొప్పుల వెంకటేశ్వర రావు, ఎస్టిఎఫ్ఐ పతాకాన్ని ఎన్.అరుణకుమారి, యుటిఎఫ్ పతాకాన్ని కె.పార్థసారథి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె. వెంకటేశ్వరరావు, కె. పార్థసారథి, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఇవివిఎస్.ప్రసాద్, గౌరవాధ్యక్షులు శంకరుడు, ఉపాధ్యక్షులు ఎం. విజయగౌరి, ఐ.రాం బాబు, జిల్లా కార్యదర్శి ఇ. శ్రీమణి, ఎం.శ్రీనివాస్, కె. రమేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్ రావు, రాష్ట్ర కౌన్సిలర్లు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

**ఏలూరు**

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్సి ఇళ్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నవంబర్ 10న స్వర్ణోత్సవ వేడుకలు ఏలూరు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లోని డిసిఎంఎస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం ఉపాధ్యాయులందరి బాధ్యత అన్నారు. ప్రభుత్వాలు ప్రభుత్వ వ్యతిరేక విధానాలు విడనాడాలన్నారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి. వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభ సమావేశం, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎంబి. శ్యాంబాబు అధ్యక్షతన విద్యా సదస్సు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ అధ్యక్షతన ప్రతినిధుల సభ నిర్వహించారు.

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా విద్య పట్ల ప్రభుత్వ వైఖరి మారడం లేదని, 117 జిఒను రద్దు చేస్తానని, ఇప్పటివరకూ దానిమీద ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. త్వరితగతిన 117 రద్దు చేసి పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి, రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమ గోదావరి జిల్లా ఎపి జెఎసి చైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు, సిఐటియు ప్రధాన కార్యదర్శి డిఎన్విడి ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు వి.కనకదుర్గ, జిల్లా కోశాధికారి జివి రంగమోహన్, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్, ఆడిట్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**ఎన్.టి.ఆర్. విజయవాడ**

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని శాసన మండలి సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహాసభ విజయవాడలోని ఎం.బి. భవన్లో నవంబర్ 24న జరిగింది. ఈ సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఆలోచించి తక్షణమే ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని అన్నారు. 12వ పిఆర్సి కమిటీ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలన్నారు.

మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ పెద్ద సంఘంగా ఘన కీర్తి గడించడంలో చాలా మంది నాయకులు, కార్యకర్తల జీవిత త్యాగాలు ఉన్నాయని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఎస్. ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉండాలన్నారు. జిఒ 117 రద్దు చేయాలని కోరారు. టీచర్ల బదిలీల సందర్భంగా రూపొందించే బదిలీ చట్టంపై సమగ్ర చర్చ జరిపి, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను తీసుకుని రూపొందించాలని కోరారు.

ఈ సభలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి కె.సంజీవరెడ్డి, సిఐటియు నాయకులు డి.వి.కృష్ణ మాట్లాడారు. అనంతరం యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య నివేదిక ప్రవేశపెట్టారు. మహాసభ సందర్భంగా తొలుత జాతీయ జెండాను యుటిఎఫ్ వ్యవస్థాపక నాయకులు వి.రంగారావు, ఎస్టిఎఫ్ఐ జెండాను కె. తిరుపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, మచ్చ శ్రీనివాస్, ఎం. కృష్ణయ్య, పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**కృష్ణా**

యుటియఫ్ కృష్ణా జిల్లా శాఖ స్వర్ణోత్సవ మహాసభలు నవంబర్ 9,10 తేదీల్లో డాక్టర్ సి.ఎల్. రాయుడు రోటరీ ఆడిటోరియం కొత్త పేట గన్నవరంలో కామ్రేడ్ షేక్ సాబ్జీ వేదికపై మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు జాతీయ పతాకావిష్కరణ చేయగా, పూర్వ జిల్లా అధ్యక్షులు పైడిపాటి రామ్‌దేవ్ ఎస్.టి.ఎఫ్.ఐ. పతాకాన్ని, పూర్వ జిల్లా సహాధ్యక్షురాలు శ్రీమతి దాసరి నవభారతి యు.టి.యఫ్. పతాకావిష్కరణ చేయడం జరిగింది.

ప్రారంభసభలో విశ్రాంత అధ్యాపకులు జి.వెంకట్రావు గన్నవరం విశిష్టత గురించి మాట్లాడారు. ఉభయ గోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "విద్యారంగ పరిణామాలు" అనే అంశంపై ప్రసంగించారు.

అనంతరం కృష్ణా జిల్లా స్వర్ణోత్సవ సావనీర్‌ను ఎమ్మెల్సీలు రాష్ట్ర, జిల్లా నాయకులు ఆవిష్కరణ చేయటం జరిగింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు "ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవటం ఎలా" అనే అంశం పై ప్రముఖ వైద్యులు విద్యా రంగ నిపుణులు డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస రావు విద్యా గోష్టి జరిగింది. అనంతరం కృష్ణా జిల్లా శాఖకు విస్తృత సేవలు అందించి పదవీ విరమణ చేసిన 54 మంది సీనియర్ నాయకులను సన్మానించారు. జిల్లా ఆటల పోటీల విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు, బహుమతి ప్రధానం పిడిఎఫ్ ఎమ్మెల్సీలచే చేయటం జరిగింది.

రెండవ రోజు కృష్ణా జిల్లా ఉద్యమ చరిత్ర అనే అంశం పై మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ఉపన్యసించారు. తదుపరి ఆర్థిక సంస్కరణలు విద్యా రంగం పై ప్రభావం అనే అంశం మాజీ ఎమ్మెల్సీ ఎంవియస్ శర్మ బోధించారు. వివిధ విద్యా విషయక తీర్మానాలు ప్రతిపాధనలు, చర్చలు, అనంతరం రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ సందేశాలు అందరినీ ఉత్తేజ పరిచాయి. ఎన్నికల అధికారులుగా ప్రచురణల కమిటీ చైర్మన్ యం.హనుమంతరావు, ఎస్.పి. మనోహర్ కుమార్‌లు వ్యవహరించటం జరిగింది.

**నూతన కమిటీ :** గౌరవ అధ్యక్షులు జాగా బత్తుల లెనిన్ బాబూ, అధ్యక్షులు షౌకత్ హుస్సేన్, సహాధ్యక్షులుగా శ్రీమతి జొన్నలగడ్డ ఝాన్సీ, నీలం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బి.కనకారావు, కోశాధికారి మరీదు వర ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

**గుంటూరు**

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు పోరాడాలని, ప్రభుత్వ విద్య ద్వారానే సామాజిక న్యాయం దక్కుతుందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహా సభలను నవంబర్ 24న గుంటూరు ఎన్‌జిఓ హోంలో జరిగాయి. తొలుత వెంకటేశ్వరా విజ్ఞాన మందిరం నుండి ఎన్ జిఒ హెూం వరకూ ఉపాధ్యాయుల ర్యాలీ నిర్వహించారు. మహాసభల ప్రారంభ సూచికగా జాతీయ జెండాను, ఎస్‌టిఎఫ్ఐ జెండాను, యుటిఎఫ్ జెండాను కెఎస్‌వి దుర్గారావు, జి.ప్రభుదాసు, ఎన్.తాండవకృష్ణ ఆవిష్కరించారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత 30 ఏళ్లలో విద్యా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ పెరిగిందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రైవేటీకరణ విధానాలే అమలు చేస్తున్నాయన్నారు.

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యుటిఎఫ్ ఉద్యమ నిర్మాణంలో గుంటూరు జిల్లా సీనియర్ నేతల పాత్ర ఎంతో ఉందన్నారు. వారి స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగ రక్షణకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు అందర్నీ ఒకే గొడుగు కిందకు తెచ్చిన ఘనత యుటియఫ్‌కు దక్కుతుందన్నారు. విలువలు, త్యాగాలతో సంఘం నిర్మితం అయ్యిందన్నారు.

యుటియఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కె.జోజయ్య మాట్లాడుతూ 50ఏళ్ల ఉద్యమ చరిత్రలో ఏకైక పెద్ద సంఘ ంగా, ఎన్నో విజయాలు సాధించిన సంఘంగా యుటిఎఫ్ నిలిచిందన్నారు. స్వర్ణో త్సవాల వెలుగులో రాబోయే కాలంలో ఉపాధ్యా యులు ఐక్యంగా పోరాడాల న్నారు. కార్యక్ర మంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎ.ఎన్. కుసుమ కుమారి, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ యం. హనుమంత రావు, జిల్లా గౌరవాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ కార్యదర్శి నివేదిక మరియు జిల్లా కార్యదర్శులు ఇతర నివేదికలు ప్రవేశ పెట్టారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి కె.ఏ.ఉమామహేశ్వరరావు వ్యవహరించారు.

**నూతన కమిటీ ఎన్నిక :** గౌరవాధ్యక్షులుగా పి.శ్రీని వాసరావు, అధ్యక్షులుగా యు.రాజశేఖరరావు, ప్రధాన కార్యదర్శి యం.కళాధర్, సహాధ్యక్షులుగా జి. వెంకట్వేర్లు, సహాధ్యక్షులుగా ఎస్.నాగమణి, కోశాధికారి ఎమ్ దౌలా, కార్యదర్శులుగా సిహెచ్. ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి. వెంకటేశ్వరరావు, టి. ఆంజనేయులు, యం. గోవిందయ్య, కె. కేదార్ నాథ్, ఎమి. షకీలాబేగం, కె. రంగారావు, కె. కామాక్షి. బి.ప్రసాద్ ఎన్నికయ్యారు.

**బాపట్ల**

ప్రభుత్వ విద్యా వ్యవస్థను, విధానాన్ని కాపాడుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ కోరారు. నవంబర్ 24న జరిగిన యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభ ఆయన మాట్లాడారు. సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్ అధ్యక్షత వహించారు.

యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు నిధుల కోసం గత ప్రభుత్వం పాఠశాల విద్యను చిన్నాభిన్నం చేసిందని అన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. జిఒ 117 రద్దుచేసి ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ పురుషోత్తం మాట్లాడుతూ యుటిఎఫ్ విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్రంలోనే పెద్ద ఉపాధ్యాయ సంఘమని పేర్కొన్నారు.

బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా విధానాన్ని బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య నేర్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తొలుత స్వర్ణోత్సవాలు జయప్రదం చేయాలని పట్టణంలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

**నూతన కమిటీ ఎన్నిక:** యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ గౌరవాధ్యక్షులు పి పాపారావు, అధ్యక్షులు జె వినయ్ కుమార్, సహాధ్యక్షులు బండి భిక్షాలు బాబు, సహాధ్యక్షురాలు ఆర్ హరిప్రియ, ప్రధాన కార్యదర్శి ఎ శ్రీనివాసరావు, కోశాధికారి ఎం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శులు కె రవిబాబు, యు చెంచయ్య, 2 విజయలక్ష్మి, ఎంవిబి సుబ్ర సుబ్రహ్మణ్యం, పి సురేష్, పి రామాంజనేయులు, ఎం సురేష్, ఆర్ పద్మావతి, కెవిఎస్ఎన్ కోటేశ్వరరావు, బి వినోద్ బాబు, రాష్ట్ర కౌన్సిలర్స్ ఎస్డ్ హబీబ్, సిహెచ్ బాపయ్య, బి శ్రీనివాసరెడ్డి, జి రాజకుమారి, ఆడిట్ కమిటీ సభ్యులు టి సుబ్బారావు, వలిఖాన్, పి సీతా రామరాజు, ఎయిడెడ్ కన్వీనర్ కె శ్రీనివాసరావు, అకడమిక్ సెల్ కన్వీనర్ సిహెచ్ హనుమంతరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ నాగమల్లేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పాల్గొన్నారు.

**ప్రకాశం**

ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవాలు ఒంగోలులో నవంబర్ 24న జరిగాయి. పివిఆర్ స్కూలు నుంచి మహాసభలు ప్రాంగణం టిటిడి కల్యాణమండపం వరకూ ఉపా ధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. టిటిడి కల్యాణమండపం ఆవరణలో జాతీయ, ఉద్యమజెండాలను సీనియర్ నేతలు ఎం, వెంకటేశ్వరరెడ్డి, కె.శ్రీనివాసరావు, ఒ.వి.వీరారెడ్డి ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన ప్రారంభసభకు జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి అధ్యక్షత వహించారు. గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు ప్రారంభోత్సవ ఉపన్యాసం చేశారు. జిల్లాలో యుటిఎఫ్ ఆవి ర్భావం నుంచి ఇప్పటి వరకూ ఉపాధ్యాయుల సమస్యలపై అనేక పోరాటాలు చేసిందన్నారు. అనేక విజయాలు సాధించామన్నారు. యుటియఫ్ బలోపేతంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదన్నారు.

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఉపాధ్యా యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ మాట్లా డుతూ ఉపాధ్యాయులు బాధ్యతతో బోధన చేయాలన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిందన్నారు.

ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వెలిగే దీపం ఇతర దీపాలను వెలి గిస్తుందన్నారు. నేర్చుకునేవారే ఇతరులకు

బోధించగలరన్నారు. యుటిఎఫ్ 50 ఏళ్ల ప్రస్థానంలో పనిచేసిన సీనియర్ నేతలను సన్మానించారు. స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆటలు, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. స్వర్ణోత్సవ సభకు జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వీరాంజనే యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు సభలను జయప్రదం చేసిన ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు.

**చిత్తూరు**

చిత్తూరు జిల్లా యుటిఎఫ్ స్వర్ణోత్సవ 17వ జిల్లా మహాసభలు పూతలపట్టు శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపం నందు నవంబర్ 3,4 తేదీలలో అట్టహాసంగా జరిగాయి.

జాతీయ పతాకం, ఎస్.టి.ఎఫ్.ఐ పతాకం, యుటిఎఫ్ పతాకాల ఆవిష్కరణ, మహార్యాలీ జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్షులు ఎం సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన జరిగిన విద్యా సదస్సులో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గు మల్ల ప్రసాద్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం తీసుకెళ్లి పరిష్కారం చేయడానికి కృషి చేస్తామన్నారు.

పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ హాజరై సందేశమిస్తూ ప్రభుత్వ విద్యారంగా అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం లో భాగంగా జీవో 117 రద్దు కోసం ఇచ్చిన ముందుకెళ్తామని తెలియజేశారు.

